FLASH INDIA NEWS

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

TELANGANA RISING 2047

సంపుటి : 16 | సంచిక :164 | ఆదివారం 03.08.2025 | ఎడిటర్ :కొమరరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-


# లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్

15 సీట్లతో ప్రధాని అయిన మోదీ



## దేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది

2014 నుంచి జరుగుతున్న ఎన్నికలపై అనుమానాలున్నాయి..

భారతదేశంలో ఈసీకి ఉనికి లేదు: రాహుల్ గాంధీ

ఈసీ ఇచ్చిన వివరాలతో పోలిస్తే మోసం బయటపడింది..

ఈసీ మాకు ఒరిజినల్ ఓటర్ లిస్ట్ ఇవ్వలేకపోయింది: రాహుల్ గాంధీ

కాంగ్రెస్ న్యాయ సదస్సులో ఈసీపై రాహుల్ గాంధీ ఫైర్..

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ చీటింగ్ చేసింది..

మా దగ్గర పక్కా ఆధారాలున్నాయి: రాహుల్ గాంధీ

ఈ మాట చెప్పేందుకు వంద రుజువులున్నాయ్

ఆధారాల కోసం 6 నెలలు పనిచేసి సాధించాం

కొన్ని రాష్ట్రాల్లో మాకు ఒక్క సీటు రాకపోవడం ఏంటి?

ఒకే పార్టీ అన్ని సీట్లనూ గెలుచుకోవడం ఏంటి..?

రాబోయే రోజుల్లో ఇవన్నీ బయటపెడతా

రాజ్యాంగం మా రక్తం.. దానిపై దాడి చేయడానికి మీరెవరు

ఏఐసీసీ లీగల్ సెల్ సదస్సులో రాహుల్ గాంధీ

6.5 లక్షల మంది ఓటర్లలో లక్షన్నర ఓట్లు ఫేక్

05

## రాబోయే ఎన్నికల్లో మోడీని ఓడిస్తాం..

- ఎన్నికల్లో గెలిచినా, ఓడినా కాంగ్రెస్ ప్రజల్లోనే ఉంది..
- మోడీ పీఎం అయ్యాక సామాజిక న్యాయంపై ఆలోచన చేయలేదు..
- రాబోయే ఎన్నికల్లో మోడీని, బీజేపీని ఓడిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి
- ఆయనను ప్రధాని కుర్చీ నుంచి దించేది రాహులే
- ఆర్ఎస్ఎస్ చెప్పినా మోదీ కుర్చీ వదలట్లేదు
- తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తం
- ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని బీజేపీ ప్రశ్నిస్తోందని 140 ఏళ్ల కిందటే ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు కదంతొక్కిందే కాంగ్రెస్ పార్టీ అని బ్రిటీష్ పాలకులను తరిమి కొట్టింది కాంగ్రెస్సే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సహా మిగతా పార్టీలు అధికారం లేకపోతే ఇంటికి పరిమితం అవుతాయి. కానీ అధికారం ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజా పక్షంలో నిలుస్తుం దేశం..





# తెలంగాణ రైజింగ్ 2047 పై

స్పోర్ట్స్ చాప్టర్ పెడతాం

## ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీ

- పీపీపీ పద్ధతిలో తెలంగాణ నూతన క్రీడా విధానం తీసుకువచ్చామని..
- అనుభవం కలిగిన వారిని క్రోడీకరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు
- సరైన విధానాలు లేకపవడం వల్లే యువత వ్యసనాలకు బానిస అవుతున్నారు
- క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్లే మాదక ద్రవ్యాలు మన వైపు దూసుకు వస్తున్నాయన్నారు
- క్రీడామైదానాలు పెళ్లిళ్లు చేసుకునే ఫంక్షన్ హాళ్లుగా లేదా సన్ బర్న్ ఈవెంట్ చేసుకునే వేదికగా మారిందన్నారు.
- ఎందరో గొప్ప గొప్ప క్రీడాకారులు హైదరాబాద్ నుంచే

02

రాజకీయ జోక్యం తగ్గించేలా న్యూ స్పోర్ట్స్ పాలసీ

దిశదశ లేకపోవడం వల్లే వ్యసనాల బారిన యువత

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

క్రీడలను ప్రోత్సహించడం మా ప్రభుత్వ విధానం అని.. క్రీడా విధానంలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి క్రీడాకారుల స్ఫూర్తిని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్రంలో క్రీడా పాలసీని-2025 తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మా విజన్ డాక్యుమెంట్ తెలంగాణ రైజింగ్ -2047 లో స్పోర్ట్స్ పాలసీని ఒక అధ్యాయంగా పెట్టామన్నామని చెప్పారు. ఇవాళ హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన 'ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్' లో సీఎం పాల్గొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి, ఒలింపిక్ పతక విజేత అభినవ్ బింద్రా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(క్రీడలు ) ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ - 2025' ను సీఎం విడుదల చేశారు. పలు అంతర్జాతీయ క్రీడా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం పలు ఎంవోయూలు కుదుర్చుకుంది.

# నా హృదయం దు:ఖంతో నిండిపోయింది


## దాయాది దేశంపై ప్రతీకారం తీర్చుకున్నం

రైతుల ఖాతాల్లో.. ₹20వేల కోట్లు కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

- మన డ్రోన్లు, మిస్సైళ్లకు పాక్ వణికిపోయింది
- పాక్ ఎయిర్ బేస్లు ఐసీయూలో ఉన్నాయ్
- ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్కు వెయ్యేళ్ల క్రితమే పునాది
- వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- వారణాసి నుంచి ఫండ్స్ జమ చేసిన ప్రధాని
- 11 కోట్ల మంది రైతులకు ₹3.46 లక్షల కోట్ల సాయం
- సొంత నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు
- 2,200 కోట్ల పనులకు శ్రీకారం చుట్టిన మోదీ

**వారణాసి :**

పహల్గాం ఉగ్రదాడితో తన హృదయం తీవ్ర దు:ఖంతో నిడిపోయిందని ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇవాళ ఆయన వారణాసిలోని కాశీ క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రధాని మంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేశారు. 20వ విడతలో భాగంగా దేశవ్యాప్తంగా 9.7 కోట్ల రైతుల ఖాతాల్లో రూ.20 వేల కోట్లకుపైగా నగదును అధికారులు జమ చేశారు. మరోవైపు ప్రధాని ప్రసంగాన్ని ప్రకాశం జిల్లా వీరాయపాలెంలో రైతులతో కలిసి సీఎం చంద్రబాబు ఎల్ఈడీలో వీక్షిస్తున్నారు. కాసేపట్లో ఆయన 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రారంభించనున్నారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వారణాసి సభలో మాట్లాడుతూ.. మిగితా 02 పేజీలో...





# క్రిమినల్ కేసు నమోదుకు కోర్టు ఆదేశం

- మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నాంపల్లి కోర్టు ఆదేశం
- కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో క్రిమినల్ కేసుకు ఆదేశం
- ఈ నెల 21లోపు క్రిమినల్ కేసు నమోదు చేసి నోటీసులు ఇవ్వాలన్న కోర్టు
- కేటీఆర్ వాదనలతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు..

03

హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు మంత్రి కొండా సురేఖపై కీలక తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు BNS సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకోబడగా, BNSS సెక్షన్ 222 r/w 223 ప్రకారం నేరాన్ని స్వీకరించాలని కోర్టు నిర్ణయించింది.కోర్టు ఆదేశాల ప్రకారం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, సమంత విడాకుల వంటి అంశాలపై కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలు ప్రాథమికంగా నిరాధారమని భావించింది. కేటీఆర్ తరపున న్యాయవాది సిద్ధార్థ్ పోగుల సమర్పించిన వాదనలను కోర్టు సమర్థించింది. సాక్ష్యులు (PW1 నుండి PW5) ఇచ్చిన వాంగ్మూలాలు, సమర్పించిన పత్రాలు, ఫిర్యాదును పరిశీలించిన తర్వాత, సురేఖపై క్రిమినల్ కేసు నమోదు

ఈ కేసులు, కొట్లాటలు నాకు కొత్త కాదు.. 06

## బీసీల హక్కులను పూర్తిగా కాలరాశారు..

### హైకోర్టు చీవాట్లు పెట్టిన తర్వాతే ఆర్డినెన్స్

- స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వానికే హక్కు
- రేవంత్ వచ్చాక ఏ పని ముందుకు సాగుతలే
- మమ్మల్ని ప్రశ్నించే అధికారం కాంగ్రెస్కి లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా వారికే ఇవ్వాలనే డిమాండ్
- హైదరాబాద్ నగరంలోని ఇందిర పార్క్ వద్ద మహాధర్నా

03



## 50 సార్లు ఢిల్లీకి సీఎం..

### రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్న రేవంత్..

- హస్తిన యాత్రలో రేవంత్ రెడ్డి అర్ధశతకం సాధించారు..
- తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారు..
- రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి కావాలి.. ఢిల్లీకి యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం కాదు: కేటీఆర్

హస్తిన యాత్రలో రేవంత్ రెడ్డి అర్ధశతకం సాధించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. ఈ పోస్టులో.. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈయన ఢిల్లీ యాత్రలకు .. తెలంగాణకు ఏ సంబంధం లేదు.. కాంగ్రెస్ పాలన చేపట్టాక రేవంత్ చేసిన మూడు పనులు: మొదటి పని ఫ్లైటు టికెట్ బుక్ చేయడం!, రెండో పని ఢిల్లీకి పోవడం!, మూడో పని ఖాళీ చేతులతో తిరిగి రావడం! అని కేటీఆర్ రాసుకొచ్చారు.ఇక, రైతన్నలు ఇబ్బందులను తట్టుకుని పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేదు.. రైతులు పొలాల్లో జల్లడానికి...



### హైదరాబాద్

| | |
|---|---|
| 22 క్యారెట్ | రూ.91,800 |
| 24 క్యారెట్ | రూ.100,150 |
| కేజీ వెండి | రూ.1,26,000 |

### చికెన్ రేటు

| | |
|---|---|
| Dressed With Skin | 190 Kg |
| Skinless | 220 Kg |
| Boneless | 280 Kg |

## ఆపరేషన్ సింధూర్ విజయానికి అంకితం

త్రివిధ దళాల వీరత్వాన్ని బంగారు శాలువాలో నేసిన నల్ల విజయ్..

చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీకి బహుమతిగా ఇవ్వనున్న నల్ల విజయ్

06






## కడుపులో కత్తులు పెట్టుకొని రాజకీయాలా

### ప్రధాని మోదీని ఒప్పించి బీసీ రిజర్వేషన్లు సాధించుకుందాం

- ముస్లింల పేరు చెప్పి అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు
- బీజేపీ నేతలు ధర్నా ఇక్కడ కాదు ఢిల్లీలో చేయాల్సింది
- కామారెడ్డి డిక్లరేషన్కు కట్టుబడి ఉన్నం : మంత్రి పొన్నం
- మహాధర్నాలో పాల్గొని వారంతా బీసీ వ్యతిరేకులు
- నాడు ప్రత్యేక రాష్ట్రం కోసం..నేడు బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పోరాటం

03

## రిక్రూట్‌మెంట్ కోసం తీవ్రవాదుల ఎత్తుగడ..

- వీడియో గేమ్స్ ఛాట్‌లో చీకటి మాటలు..

**ఢిల్లీ :** ప్రస్తుతం ఔట్ డోర్ గేమ్స్ కంటే ఆన్ లైన్ గేమ్స్ లేదా వీడియో గేమ్స్ ఆడేందుకే నేటి తరం ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గంటల తరబడి స్క్రీన్ ముందు అతుక్కుపోతున్నప్పటికీ.. ఇంట్లో ఆడుకుంటున్నారు కదా అని పేరెంట్స్ పట్టించుకోకపోతే ఇక అంతే సంగతులు అంటున్నారు బ్రిటిష్ పరిశోధకులు. ఎందుకంటే, వీడియో గేమ్స్ ఆడేటప్పుడు ఇతరులతో ఛాట్ చేయడానికి అవకాశం ఉంటుంది. దీనిపై నిఘా అతితక్కువగా ఉంటుంది. దీన్నే అవకాశంగా మార్చుకుంటున్నాయి టెర్రరిస్టు బృందాలు. అమాయక పిల్లలను, టీనేజర్లను తమ వైపు లాక్కునేందుకు గేమింగ్ వరల్డ్ ను పావుగా వాడుకుంటున్నాయి.టీనేజ్ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్రవాదం వైపు మళ్లించడానికి తీవ్రవాదులు లైవ్ స్ట్రీమ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తున్నారని బ్రిటిష్ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఫ్రాంటియర్స్ ఇన్ సైకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన నివేదిక ప్రకారం, వివిధ రకాల తీవ్రవాద గ్రూపులు, వ్యక్తులు వీడియో గేమ్‌లు ఆడుతూ చాట్ చేయడానికి, లైవ్ స్ట్రీమ్ చేయడానికి అనుమతించే ప్లాట్‌ఫారమ్‌లను టెర్రరిస్టుల నియామకానికి అడ్డాగా మార్చుకుంటున్నాయి.

## మురికివాడల ప్రజలకు ఆ ఫ్లాట్లు

**ఢిల్లీ :** మురికివాడలలో నివసించే పేద ప్రజలకు 50,000 ఫ్లాట్లను ఇవ్వనున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. ఈ ఫ్లాట్లను జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రిన్యూవల్ మిషన్ కింద దశాబ్దం క్రితం నిర్మించారు. కానీ గత ప్రభుత్వాలు వీటిని కేటాయించక పోవడంతో నివాసయోగ్యం కాని స్థితిలో ఉన్నాయని ఆమె మీడియాతో చెప్పుకొచ్చారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే ఆ ఫ్లాట్లకు మరమత్తులు చేసి, పునరుద్ధరించి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ కింద అర్హత ఉన్న మురికివాడల నివాసితులకు అందజేస్తామని సీఎం తెలిపారు.ప్రాజెక్ట్ కోసం ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్ మెంట్ బోర్డ్ , ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లకు ₹700 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు ఆమె గుర్తు చేశారు. ఇటీవల ఢిల్లీ పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో మురికివాడలను పునరావాసం లేకుండా కూల్చివేయడాన్ని నిషేధిస్తూ.. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం తొలగింపు అనివార్యమైతే ముందుగా ప్రత్యామ్నాయ గృహాలను అందించాలని సీఎం రేఖా గుప్తా అధికారులను ఆదేశించారు. ఈ చర్య ఢిల్లీలోని 675 మురికివాడల క్లస్టర్ లలోని సుమారు 3.06 లక్షల గృహాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించే లక్ష్యంతో చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

## నేడు కాళేశ్వరం నివేదికపై కీలక సమావేశం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం కమిషన్ నివేదికపై రేపు సచివాలయంలో కీలక సమావేశం జరగనుంది. నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ కానున్నారు. అంతే కాకుండా ఈ నెల 4వ తేదీన కమిషన్ నివేదికపై మంత్రివర్గం సైతం చర్చించనుంది. ఇదిలా ఉంటే నిన్న సీఎం రేవంత్ రెడ్డి చేతికి కాలేశ్వరం కమిషన్ నివేదిక అందిన సంగతి తెలిసిందే.నివేదికలోని అంశాలపై సీఎం రేవంత్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు సీఎస్ తో చర్చించారు. నివేదిక అధ్యయనం కోసం ఓ కమిటీని కూడా వేశారు. నివేదికలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మాణంలో అక్రమాలకు పాల్పడినట్టు తేలిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కేసీఆర్ దోషి అని కమిషన్ తేల్చిందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. వారికి శిక్ష తప్పదని అన్నారు. ఈ క్రమంలో ఏం జరుగుతుందా అనే ఉత్కంఠ నెలకొంది.

# నా హృదయం దు:ఖంతో నిండిపోయింది

మొదటి పేజీ తరువాయి

కాశీ వాసుల కోసం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తాను కాశీకి రావడం ఇదే తొలిసారి అని కామెంట్ చేశారు. పహల్గాంలో 26 మంది అమాయక పౌరులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని.. తన హృదయం దు:ఖంతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాశీ విశ్వనాథుడు, ఆ మహాదేవుడి ఆశీర్వాదంతో ఉగ్రవాదులు, దాయాది దేశంపై ప్రతీకారం తీర్చుకన్నామని అన్నారు. ఇండియన్ ఆర్మీ డ్రోన్లు, మిసైళ్ల దెబ్బకు పాకిస్థాన్ వణికిపోయిందని కామెంట్ చేశారు. నేటికి ఆ దేశ ఎయిర్ బేస్ లు అన్ని ఐసీయూ (ICU)లో పడి ఉన్నాయని సెటైర్లు వేశారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని మహాదేవ్ పాదాలకు, సిదూరం కోల్పోయిన మహిళలకు అంకితం చేస్తున్నానని ప్రధాని మోడీ తెలిపారు.రైతులు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోడీ అన్నారు. అన్నదాతలకు చేయూతను ఇచ్చేందుకే తాము పీఎం కీసాన్ యోజన పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దేశ వ్యాప్తంగా వేల గోదాములను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 3 కోట్ల మంది లక్ పతి దీదీలను తయారు చేస్తున్నామని.. ఇప్పటికే కోటిన్నర మంది లక్ పతి దీదీలుగా మారారని తెలిపారు. కానీ, అసత్యాలతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నేతలు పక్కదారి పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము అమలు చేసే పథకాలు రైతులకు అత్యంత ప్రజయోజనం చేకూరుస్తున్నాయని.. వారి కోసం తాజాగా మరో 21 వేల కోట్లు నిధులు విడుదల చేశామని తెలిపారు. అన్నదాతలను ఆదుకునేలా ఎన్డీఏ సర్కార్ అనేక పథకాలను తీసుకొచ్చిందని, వారి సంక్షేమం కోసం అహర్నిశలు పని చేస్తూనే ఉన్నామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.

**ట్రంప్ ''డెడ్ ఎకానమీ'' కామెంట్స్‌కి మోడీ అదిరిపోయే కౌంటర్..**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థను ''డెడ్ ఎకానమీ''గా పోల్చారు. రష్యాతో భారత సంబంధాలను ఉద్దేశిస్తూ, రెండు దేశాలు ఆర్థిక వ్యవస్థలు చనిపోయే స్థితిలో ఉన్నాయని అన్నారు. అయితే, ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉందని శుక్రవారం అన్నారు. భారత ఆర్థిక ప్రయోజనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, స్వదేశీ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రపంచ అస్థిర వాతావరణాన్ని ప్రస్తావిస్తూ.. దేశ ప్రయోజనాలకు సేవ చేయడానికి ప్రభుత్వం అవసరమైన ప్రతీ పనిని చేస్తోందని ప్రధాని మోడీ నొక్కి చెప్పారు. ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించినంత వరకు అప్రమత్తంగా ఉండాలని వారణాసిలో జరిగిన ఒక ర్యాలీలో ఆయన అన్నారు. ''మా ప్రభుత్వం దేశ ప్రయోజనాల కోసం చేయగలిగినదంతా చేస్తోంది. దేశానికి ఉత్తమంగా ఉండాలని కోరుకునేవారు, భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చూడాలనుకునేవారు, అది ఏ రాజకీయ పార్టీ అయినా, తమ విభేదాలను పక్కనపెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల కోసం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలి'' అని అన్నారు.మనమంతా భారతీయులు తయారు చేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేస్తామని, స్థానికుల కోసం మనం గొంతు కలపాలని ప్రధాని అన్నారు. జూలై 31న, భారతదేశ ఉత్పత్తులపై ట్రంప్ 25 శాతం సుంకాలు విధించిన ఒక రోజు తర్వాత, ట్రంప్ భారత్-రష్యా సంబంధాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రెండు దేశాలు చనిపోయిన ఆర్థిక వ్యవస్థలుగా మరింత దిగజారిపోతాయని అన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత ప్రధాని మోడీ నుంచి కౌంటర్‌గా భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని చెప్పారు.వారణాసి ర్యాలీలో, పాకిస్తాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాద శక్తులు పాతాళలోకంలో ఉన్నప్పటికీ వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మహాదేవుడు తన రుద్ర రూపాన్ని అలంకరించాడు, ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ సత్తాను ప్రపంచం మొత్తం చూసిందని అన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడాన్ని కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. పాకిస్తాన్ బాధను సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ భరించలేకపోతున్నాయని ఎద్దేవా చేశారు.

# తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్ పెడతాం




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** క్రీడలను ప్రోత్సహించడం మా ప్రభుత్వ విధానం అని.. క్రీడా విధానంలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి క్రీడాకారుల స్ఫూర్తిని పెంపొందించాలని తెలంగాణ రాష్ట్రంలో క్రీడా పాలసీని-2025 తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మా విజన్ డాక్యుమెంట్ తెలంగాణ రైజింగ్ -2047 లో స్పోర్ట్స్ పాలసీని ఒక అధ్యాయంగా పెట్టామన్నామని చెప్పారు. ఇవాళ హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన 'ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్' లో సీఎం పాల్గొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి, ఒలింపిక్ పతక విజేత అభినవ్ బింద్రా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(క్రీడలు ) ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ -2025' ను సీఎం విడుదల చేశారు. పలు అంతర్జాతీయ క్రీడా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం పలు ఎంవోయూలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని చదువులోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాలన్నారు. పీపీపీ పద్ధతిలో తెలంగాణ నూతన క్రీడా విధానం తీసుకువచ్చామని.. కార్పొరేట్ రంగంలో సక్సెస్ రేటు ఉన్నవారు, క్రీడల్లో మెడల్స్ సాధించిన వారిని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, వ్యవస్థలను నిర్వహించిన అనుభవం కలిగిన వారిని క్రోడీకరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేసిందన్నారు.ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపవడం వల్లే యువత వ్యసనాలకు బానిస అవుతున్నారని సీఎం చెప్పారు. ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్లే మాదక ద్రవ్యాలు మన వైపు దూసుకు వస్తున్నాయన్నారు. పోరాట స్ఫూర్తి ఉన్న తెలంగాణ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, ప్రపంచంతోనే పోటీ పడి దేశానికి గొప్ప పేరు తేవాలని తెలంగాణకు నూతన క్రీడా పాలసీని తీసుకువచ్చామన్నారు. క్రీడామైదానాలు పెళ్లిళ్లు చేసుకునే ఫంక్షన్ హాళ్లుగా లేదా సన్ బర్న్ ఈవెంట్ చేసుకునే వేదికగా మారిందన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని స్పష్టమైన క్రీడా విధానాన్ని, స్పోర్ట్స్, యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలనుకున్నట్లు చెప్పారు. ఎందరో గొప్ప గొప్ప క్రీడాకారులు హైదరాబాద్ నుంచే ఉన్నారని సీఎం చెప్పారు. అజారుద్దీన్, రవితాం, వీవీఎస్ లక్ష్మణ్, సిరాజ్, నిఖత్ జరీన్, దీప్తీ మనవాళ్లేనన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వహించడం వల్లే మొన్న జరిగిన ఒలింపిక్స్ గేమ్స్ చూశాక నేను స్పష్టంగా నిర్ణయించుకున్నాను.. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశం ఒక్క గోల్డ్ మెడల్ కూడా తెచ్చుకోకపోవడం నిజంగా మన దేశానికి మన జాతికి అవమానంగా ఇది భావిస్తున్న. ప్రపంచంతోనే పోటీ పడాలనుకుంటున్న భారత దేశం ఒలింక్ గేమ్స్ పతాకాల్లో 71వ స్థానంలో ఉండటం మనంతరం ఆలోచించాల్సిన సమయం అన్నారు. 2026లో ఖేలో ఇండియాను తెలంగాణను నిర్వహించాలని కేంద్ర మంత్రి మాన్సుఖ్ మాండవీయాను రిక్వెస్ట్ చేశామని తెలిపారు.

# రాబోయే ఎన్నికల్లో మోడీని ఓడిస్తాం..

**ఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని బీజేపీ ప్రశ్నిస్తోందని 140 ఏళ్ల కిందటే ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు కదంతొక్కిందే కాంగ్రెస్ పార్టీ అని బ్రిటీష్ పాలకులను తరిమి కొట్టింది కాంగ్రెస్సే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ సహా మిగతా పార్టీలు అధికారం లేకపోతే ఇంటికి పరిమితం అవుతాయి. కానీ అధికారం ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజా పక్షంలో నిలుస్తుందన్నారు. ఇవాళ ఢిల్లీలో జరిగిన ఐఐసీసీ లీగల్ సెల్ కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇందిరా గాంధీ పాకిస్తాన్ ను ముక్కలు చేసిందని, తీవ్రవాదంపై పోరాటం చేసి ఇందిరా, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారన్నారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత సోనియా గాంధీ అని చెప్పారు. దేశం కోసం మన్మోహన్ ను ప్రధానిని చేశారన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనుకుంటే ఎప్పుడో అయ్యేవారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో అవకాశం వచ్చినా కేంద్ర మంత్రి పదవిని, ప్రధాన మంత్రి పదవిని తీసుకోకుండా సీనియర్లకు అవకాశం ఇచ్చి తాను కార్యకర్తలా పేద ప్రజల కోసం పని చేస్తున్నారన్నారు. పదవులు త్యాగం చేసిన ఘనత గాంధీ కుటుంబానిదని చెప్పారు.ఓ వైపు రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాలు, దళితులు, ఆదివాసి, ఓబీసీలకు సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తుంటే చేస్తుంటే మరోవైపు నరేంద్ర మోడీ 26 ఏళ్లుగా పదవులు వదులుకోవడం లేదన్నారు. 2001 లో గుజరాత్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి ఇప్పటి వరకు మోడీని తప్పించాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు మోడీని తప్పించాలని ప్రయత్నం చేస్తున్నారు. కానీ నరేంద్ర మోడీ మాత్రం పదవిని వదులుకోవడం లేదని విమర్శించారు. 75 ఏళ్ల తర్వాత పదవిలో ఉండొద్దని ఇటీవలే మోహన్ భగవత్ చెప్పారు. అయినా మోడీ మాత్రం తన కుర్చీ వదులుకోవడానికి సిద్ధంగా లేరు. గతంలో అద్వానీ, మురళీ మనోహర్ కు వర్తించిన వయస్సు మోడీకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీని దించడం బీజేపీ, సంఘ్ పరివార్ నేతల వల్ల కాదని, మోడీని పదవి నుంచి దించబోయేది రాహుల్ గాంధీ మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో మోడీని ఓడించి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుతామన్నారు. సామాజిక న్యాయం కాపాడుతామన్నారు. మోడీ లేకుండా బీజేపీ 150 సీట్లు గెలవదని ఇటీవలే బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చెప్పారు. నిశికాంత్ దూబే రాసిపెట్టుకోండి.. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ మోడీతో తలపడి బీజేపీకి 150 కంటే ఒక్క సీటు కూడా ఎక్కువ రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుటుంబం సిద్ధంగా ఉందన్నారు.భారత్ జోడో యాత్రలో సామాజిక న్యాయం గురించి రాహుల్ గాంధీ మాట్లాడారని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని తాము కులగణన చేసి చూపించామన్నారు. భారత దేశానికి తెలంగాణ మోడల్ చూపించామన్నారు. రాబోయే రోజుల్లో ఈ దేశంలో సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో కులగణన చేసి తీరుతామన్నారు. ఈ దేశంలో కొత్త సామాజిక న్యాయం చేసి చూపుతామన్నారు.

**తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తం**

తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం (ఆగస్ట్ 2) ఢిల్లీలో ఏఐసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సు జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు.75 ఏళ్లకు పదవి నుంచి దిగిపోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెబుతున్నారని.. కానీ ప్రధాని సీటు వదులుకోవడానికి మోడీ ముందుకు రావడం లేదన్నారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. ''కాంగ్రెస్ దేశానికి ఏం చేసిందని బీజేపీ అడుగుతోంది. దేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి స్వాతంత్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే. దేశానికి రాజ్యాంగాన్ని అందించింది కాంగ్రెస్ పార్టీనే. సామాజిక న్యాయం కోసం పని చేస్తోన్న పార్టీ కాంగ్రెస్సే. బీజేపీ సహా అన్ని పార్టీలు అధికారం లేకపోతే ఇంటికే పరిమితమవుతాయి.. కానీ అధికారం ఉన్నా లేకపోయిన కాంగ్రెస్ ప్రజల పక్షాన కొట్లాడుతోంది. మాది ఎప్పటికీ ప్రజల పక్షమే. దేశం కోసం గాంధీ కుటుంబ ఎన్నో త్యాగాలు చేసింది'' అని హాట్ కామెంట్స్ చేశారు సీఎం రేవంత్.


## హిందువులను టెర్రరిస్టులుగా చూపింది..

- మెదక్ లోని రామాలయం వద్ద ఉద్రిక్తత..
- తెలంగాణలో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఎన్నో గుళ్లున్నాయి..
- వాటిని తమ అధీనంలోకి తీసుకుని బాగు చేయాలని వినతి..
- హిందువులను టెర్రరిస్టులుగా యూపీఏ సర్కార్ చూపించింది: ఎంపీ రఘునందన్ రావు



**మెదక్ ,ఫ్లాష్ ఇండియా :** మెదక్ లోని రామాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో హిందూ సంఘాలు, అఖిలపక్ష నాయకులు రామాలయం వద్దకు భారీగా వచ్చారు. దేవాదాయ శాఖ పరిధిలోకి ఆలయాన్ని తీసుకునేందుకు అధికారుల ప్రయత్నం చేశారు. అధికారులను అఖిలపక్ష నాయకులు, హిందుసంఘాలు అడ్డుకున్నాయి. దీంతో అధికారులు, పోలీసులు అఖిలపక్ష నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇక, ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోకి ఆలయాన్ని తీసుకోవద్దంటూ ఆందోళన చేశారు.ఇక, మెదక్ లో వివాదానికి కారణమైన రామాలయాన్ని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ రామలయాన్ని ఎండోమెంట్ లోకి ఎలా తీసుకుంటారు అని ప్రశ్నించారు. తెలంగాణలో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఎన్నో గుళ్లు ఉన్నాయి.. వాటిని తమ అధీనంలోకి తీసుకుని బాగు చేయాలని కోరారు. గతంలో హిందువులను టెర్రరిస్టులుగా అప్పట్లో యూపీఏ సర్కార్ చూపించింది అని ఆరోపించారు. పాకిస్థాన్ ఏజెంట్ లుగా యూపీఏ నేతలు మారారు.. హిందువుల్లో ఐక్యత తక్కువగా ఉంటుందనే అధికారంలో ఉండే పార్టీలు ఇలా చేస్తున్నాయని పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్ లో ఆర్మీ సైనికులు తమ ప్రాణాలకు తెగించి పని చేస్తారు అని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.

## సరోగసిని వ్యాపారంగా మార్చి దందా..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని, ఐవీఎఫ్ , సరోగసిని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం అవకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐవీఎఫ్ క్లినిక్ లలో తనిఖీలు, నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ సభ్యులుగా కమిటినీ నియమిస్తూ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈకమిటీ నేతృత్వంలో ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వ హించనున్నారు. ఆయా సెంట ర్ల పై ఇదివరకే నమోదైన కేసుల వివరాలు సేకరించనున్నారు. ఆయాసెంటర్ల అనుమ తులు, రిజిస్ట్రేషన్ల వ్యాలిడిటీ వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ ను పది రోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

## అగ్నివీర్ దరఖాస్తుల గడువు పెంపు

**ఢిల్లీ :**నిరుద్యోగులకు మరోసారి శుభవార్త తెలిపింది కేంద్ర ప్రభుత్వం. ఐఏఎఫ్ లో అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తు గడువును పొడిగించింది. ఆగష్టు 4 వరకు అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. అయితే అగ్నివీర్ దరఖాస్తుల గడువు జులై 31 తోనే ముగియగా.. అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని ఆగస్టు 4 వరకు దరఖాస్తు గడువును పెంచే నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు అధికారులు.02-07-2005 నుంచి 02-01-2009 మధ్య జన్మించిన అవివాహితులు ఈ దరఖాస్తులకు అర్హులు. 10+2 లేదా 10+డిప్లొమా, ఇంటర్ లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ తోపాటు మొత్తం 50% మార్కులు పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు రూ.550 చెల్లించాల్సి ఉంటుంది. రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్టుల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

## కాంగ్రెస్-బీఆర్ఎస్ బాహాబాహీ..

- సంగారెడ్డి హత్నూరలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత
- రైతు వేదికలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
- అదేసమయంలో సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు
- ఇది ప్రభుత్వ కార్యక్రమమా..? అధికారిక కార్యక్రమమా..? అని వారించిన ఎమ్మెల్యే సునీత
- రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని చింపివేసేందుకు ప్రయత్నించిన BRS కార్యకర్తలు ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం.



**హత్నూరు,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లా హత్నూరులో శుక్రవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రాజకీయ ఘర్షణలకు వేదికైంది. ప్రభుత్వ పథకాన్ని ప్రజలకు అందించే కార్యక్రమం క్రమంగా కాంగ్రెస్-బీఆర్ ఎస్ వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇది కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే జరగడంతో వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తమైంది."ప్రభుత్వ పథకాల పంపిణీ వేదికను రాజకీయ ప్రచార వేదికగా మార్చడం సమంజసం కాదు. ఇది అధికారిక కార్యక్రమమా, లేక పార్టీ కార్యక్రమమా?" అని ప్రశ్నించారు.ఈలోగా, అక్కడికొచ్చిన బీఆర్ ఎస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డి ఫ్లెక్సీపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, దానిని చింపివేయడానికి ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ ఎస్ వర్గాల మధ్య తీవ్రమైన వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు వెంటనే రంగప్రవేశం చేశారు. ఇరు వర్గాల కార్యకర్తలను సభా ప్రాంగణం నుండి బయటకు పంపి పరిస్థితిని నియంత్రించారు. అయితే ఘర్షణతో కార్యక్రమం తాత్కాలికంగా అంతరాయం కలిగింది.ఈ ఘటనపై కాంగ్రెస్, బీఆర్ ఎస్ వర్గాలు పోలీస్ స్టేషన్ లో పరస్పరం ఫిర్యాదులు నమోదు చేసుకున్నాయి. ఇటీవల నర్సాపూర్ నియోజకవర్గంలో వరుసగా రాజకీయ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ ఘటన మరింత చర్చనీయాంశమైంది.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ప్రజాప్రభుత్వం వచ్చాకే సంక్షేమ పథకాలు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రజా ప్రభుత్వం వచ్చాకే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఐటీశాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కర్మన్ ఘాట్ లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ , మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ , కార్పొరేషన్ చైర్మన్లు మల్ రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జీహెచ్ ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్ రెడ్డి, సుజాతానాయక్ , జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ , యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి జక్కిడి ప్రభాకర్ రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎల్బీనగర్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు అయిన కొత్త రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డి కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు.ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు.అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించలేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రోడ్డుడెవల్‌పమెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూ పించి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్లు వేణుగోపాల్, జానకి, డీఎస్ఓ వనజాత, ఏఎస్ఓ పుల్లయ్య, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాత, వైకుంఠం, సూర్యప్రకాష్ గుప్తా పాల్గొన్నారు.

# 50 సార్లు ఢిల్లీకి సీఎం..

## రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్న రేవంత్..

- హస్తిన యాత్రలో రేవంత్ రెడ్డి అర్ధశతకం సాధించారు..
- తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్‌తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్‌తో నడిపిస్తున్నారు..
- రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి కావాలి..
- ఢిల్లీకి యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం కాదు: కేటీఆర్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హస్తిన యాత్రలో రేవంత్ రెడ్డి అర్ధశతకం సాధించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. ఈ పోస్టులో.. తెలంగాణ రాష్ట్రాన్ని ఫైల్స్ తో కాకుండా.. ఫ్లైట్ బుకింగ్స్ తో నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈయన ఢిల్లీ యాత్రలకు .. తెలంగాణకు ఏ సంబంధం లేదు.. కాంగ్రెస్ పాలన చేపట్టాక రేవంత్ చేసిన మూడు పనులు: మొదటి పని – ఫ్లైటు టికెట్ బుక్ చేయడం!, రెండో పని – ఢిల్లీకి పోవడం!, మూడో పని – ఖాళీ చేతులతో తిరిగి రావడం! అని కేటీఆర్ రాసుకొచ్చారు.ఇక, రైతన్నలు ఇబ్బందులను తట్టుకుని పండించిన పంటలకు మార్కెట్లో మద్దతు ధర లేదు.. రైతులు పొలాల్లో జల్లడానికి యూరియా లేదని కేటీఆర్ పేర్కొన్నారు. సాగు నీళ్లు రావు.. తాగునీళ్లు లేవు, కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎత్తిపోతల మరమ్మతు పనులు జరగకుండా అడ్డుకుంటూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నామన్న సోయి లేదు అని మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ శాశ్వతంగా నష్టపోతుందన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు.. రెండు లక్షల ఉద్యోగాల ఊసు లేదు .. జాబ్ క్యాలెండర్ల జాడ లేదు.. రుణమాఫీ కాలేదు- రైతు భరోసా రాలేదు.. తులం బంగారం ఊసు లేదు .. రూ.4 వేల ఫించన్ జాడ లేదు.. గురుకులాల గోడు పట్టదు – గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు వినపడడం లేదు.. కానీ రేవంత్ రెడ్డి 3 రోజుల్లో 3 ఫ్లైట్ లు ఎక్కుతున్నాడు .. దిగుతున్నాడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక్కసారి కాదు.. రెండు సార్లు కాదు.. 50 సార్లకు చేరిన హస్తిన యాత్ర రేవంత్ రెడ్డి.. తెచ్చింది ఏమీ లేదు! అని కేటీఆర్ ఆరోపించారు. శుష్కప్రియాలు .. శూన్య హస్తాలు, అయిననూ పోయి రావలె హస్తినకు!.. కానీ ఢిల్లీ యాత్రలతో మన రాష్ట్రానికి వచ్చిందేమిటి? అని ప్రశ్నించారు. నో ప్రాజెక్ట్, నో ఫండింగ్, నో ప్యాకేజీ.. రాష్ట్రాన్ని పాలించే ముఖ్యమంత్రి కావాలి.. ఢిల్లీకి యాత్రలు చేసే టూరిస్ట్ సీఎం కాదు అని మండిపడ్డారు.

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఖాయం..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. మూడు నెలల్లోపు శాసనసభ స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని తేల్చి చెప్పింది. అదేవిధంగా న్యాయస్థానమే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అదేవిధంగా ఇదే కేసులో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును డిస్మిస్ చేసింది. ఈ క్రమంలోనే సుప్రీం కోర్టు తీర్పుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు ఇవాళ ఆయన ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం పక్కా కామెంట్ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఉపఎన్నికలకు పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని నాయకులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలా కృషి చేయాలని అన్నారు. ఆ ఎన్నికల తర్వాతే పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిద్దామని కేసీఆర్ పేర్కొన్నారు.బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ స్టేట్ మెంట్లు ఇస్తున్నా.. సీఎం రేవంత్ ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఊరూరా ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని కేసీఆర్ అన్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీకి లోక్ సభలో డజన్ మంది ఎంపీలు ఉంటే బనకచర్ల అంశంపై గట్టిగా కొట్లాడేవారని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీల చేతగానితనంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఫైర్ అయ్యారు. బనకచర్లపై రాజకీయ, న్యాయపరమైన పోరాటానికి బీఆర్ఎస్ సన్నద్ధం కావాలని తెలిపారు. సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు బహిరంగ సభ నిర్వహించేందుక ప్లాన్ చేస్తున్నామని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా పార్టీ కేడర్ ను సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ నెల 8న కరీంనగర్ సభ తర్వాత రాష్ట్రపతిని పార్టీ ప్రతినిధి బృందం కలిసి బీసీ రిజర్వేషన్ల అమలుకు విజ్ఞప్తి చేయబోతోందని పార్టీ శ్రేణులకు కేసీఆర్ తెలిపారు.

# నిబద్ధతతో చేసినప్పుడే సమాజంలో గౌరవం



**అందోల్ ,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందడుగు వేయాలని ఏఐసీసీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశం బాగుండాలంటే నేటీ యువత రాజకీయాల్లోకి రావాలని, నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకొవాలన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని నెహ్రూ మెమెరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో కలిసి శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను, పొదలను తొలగించి శుభ్రం చేశారు. కళాశాల ప్రాంగణంలో నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు.అనంతరం విద్యార్థులతో సమావేశమై వారితో మాట్లాడారు. విద్య పూర్తయిన తర్వాత ఏ లక్ష్యాలను ఎంచుకున్నారని వారిని ప్రశ్నించగా, వారు టీచర్, లాయర్, ఇంజనీర్ అంటూ ఇలా విద్యార్థులు ఒక్కొక్కరుగా చెప్పుకొచ్చారు. దీంతో ఆమె రాజకీయాలపై ఎందుకు ఆసక్తిని చూపించడం లేదని వారిని ప్రశ్నించారు. మనం చేసే వృత్తిని నిజాయితీతో, నిబద్ధతతో చేసినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. తాము కళాశాలలోనే శ్రమదానం నిర్వహించడం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరిగి, గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను శుభ్రపరిచే విధంగా వారిలో ప్రేరణ కలుగుతుందన్నారు. శ్రమదానం నిర్వహించడం వలన కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. విద్యార్థులు కష్టపడి చదవి, ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. మాతృబాషతో పాటు ఇంగ్లీష్, హిందీ భాషల పై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజనర్సింహ పౌండేషన్ చైర్మన్ త్రిష రాజనర్సింహ, మార్క్ ఫేడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్ లు ఎస్ .సురేందర్ గౌడ్, రంగ సురేష్, డాకూరి శంకర్, పి.ప్రవీణ్ కుమార్,లక్ష్మణ్, దుర్గేష్, పడిగె సత్యం, మాజీ ఎంపీటీసీ డీజీ.వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, ఎన్ ఎస్ యూఐ నాయకులు వినయ్ గౌడ్, పృథ్వీరెడ్డి, మల్లేశం, ఖాజా, కాలీద్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో పాటు సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో శ్రమదానంలో పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలోని బొటానికల్ పార్కులో పెరిగిన పోదలను, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జనహిత పాదయాత్ర ప్రజలకు చేరువయ్యేందుకేనని, వారి హితం కోసమేనని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. కాంగ్రెస్ పార్టీ విధానంలోనే పాదయాత్ర ఓ భాగమేనని ఆయన స్పష్టం చేశారు. మరో విడతలో నిర్వహించబోయే పాదయాత్రలో సీఎం రెవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు సైతం పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ పాదయాత్ర వలన ప్రజల కష్ట సుఖాలు, సమస్యలు, ప్రభుత్వ పనితీరు వంటి ఇతరత్రా అంశాలు తెలుస్తాయన్నారు.జోగిపేట డిగ్రీ, పీజీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ హామీనిచ్చారు. కళాశాలలో శ్రమదానం నిర్వహించిన అనంతరం అధ్యాపకులు మంత్రిని కలిసి సమస్యలను వివరించడంతో ఆయన స్పందించారు. కళాశాల తూర్పు వైపున ఖాళీ స్థలం ఉండడంతో పరిశీలించిన ఆయన మైదానాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అటువైపు నుంచే కళాశాల ప్రధాన గేటును ఏర్పాటు చేసుకుందామన్నారు. అంతేకాకుండా డిగ్రీ, పీజీ కళాశాల భవనాలకు మరమ్మత్తులను చేపట్టి, కలర్ వేయిద్దామన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని ఆయన స్పష్టం చేశారు.

# స్ట్రాంగ్ రూంలను సిద్ధం చేయాలి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో స్థానిక సంస్థల స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు కీలక తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు 90 రోజుల్లో సెప్టెంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ధర్మాసనం సర్కార్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి మరో కీలక అప్ డేట్ అందింది. బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను యుద్ధ ప్రాతిపదకన సిద్ధం చేయాలని తాజాగా అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం సంచలన ఆదేశాలు జారీ చేసింది. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, ఇతర సామగ్రితో పాటు పూర్తి సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్ లో తమకు పంపాలని ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది.కాగా, రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోసం కొత్తగా ఓటర్ల జాబితాను రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా సన్నాహాలు జోరుగా కొనసాగుతున్నాయి. పంచాయతీలు, వార్డుల సంఖ్య మరింత పెరగటంతో పూర్తిస్థాయి పక్కా సమాచారంతో జాబితాను తయారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా పంచాయతీ కార్యదర్శి స్థాయిలో గ్రామాన్ని యూనిట్ గా తీసుకొని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించనున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను తయారు చేసి నేరుగా ఎంపీడీవో లాగిన్ ద్వారా టీపోల్ సాఫ్ట్ వేర్ లో చేర్చారు. అయితే, ఇప్పుడు రాష్ట్రంలో కొత్త గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్య పెంచాలని సర్కార్ కు పెద్ద ఎత్తున వినతులు రావడంతో అందుకు అనుగుణంగా మార్పులు చేయాలని నిర్ణయించారు. దీంతో గ్రామాలు, వార్డుల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా మారే అవకాశం ఉంది.


# బీసీల హక్కులను పూర్తిగా కాలరాశారు..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో బీసీల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్ నగరంలోని ఇందిర పార్క్ వద్ద అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో భాగంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా వారికే ఇవ్వాలనే డిమాండ్ చూస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ నిలువునా మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పై బీజేపీని ప్రశ్నించే హక్కు హస్తం పార్టీకి లేదన్నారు.యావత్ తెలంగాణ లోని బీసీలంతా బీజేపీ వెంటే ఉన్నారని కామెంట్ చేశారు. బీసీ రిజర్వేషన్ల ముసుగులో 42 శాతంతో రిజర్వేషన్లలో ముస్లింలను చేర్చడం దుర్మార్గమని ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ ను అనుసరించి 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకు మాత్రమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, ఆ టూర్లతో రాష్ట్రానికి చేకూరిన ప్రయోజనం శూన్యం అని ధ్వజమెత్తారు. కనీసం సీఎం రేవంత్ రెడ్డి కి రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని.. మళ్లీ నేడు జంతర్ మంతర్ వద్ద డ్రామాలు వేసేందుకు కాంగ్రెస్ ట్రూప్ బయలుదేరిందని రాంచందర్ రావు సెటైర్లు వేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల లెక్క కాదు

- నాకు మంత్రి పదవి కావాలని అడగలేదు.. వద్దని చెప్పలేదు..
- బీజేపీ పార్టీలో ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి అనేది అధిష్టానం నిర్ణయిస్తుంది..
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల లెక్క కాదు బీజేపీ: బండి సంజయ్



**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్ జిల్లా చొప్పదండిలో సైకిళ్ళ పంపిణీ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. మంత్రి పదవి నాకు వద్దని చెప్పలేదు, కావాలని నేను అధిష్టానాన్ని అడగలేదన్నారు. క్రమశిక్షణ గల బీజేపీ పార్టీలో ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి అనేది అధిష్టానం నిర్ణయిస్తుంది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలాంటింది కాదు బీజేపీ అన్నారు. నాకు మా నాయకత్వం ఏ బాధ్యత ఇచ్చినా నేను నిర్వహిస్తా.. రైతును రారాజును చేయడమే నరేంద్ర మోడీ లక్ష్యం.. 11 ఏళ్లలో రైతుల కోసం రూ.71 లక్షల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం మోడీదే అని బండి సంజయ్ పేర్కొన్నారు.ఇక, రైతులు ఎరువుల కోసమే సబ్సిడీ రూపంలో రూ.11 లక్షల కోట్లకు పైగా నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. కనీస మద్దతు ధర అందించేందుకు 16 లక్షల 35 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసింది మోడీ సర్కార్.. అలాగే, కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతుల ఖాతాల్లో రూ.3 లక్షల 69 వేల 561 కోట్లు జమ చేశాం.. పదవ తరగతి బాగా చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు స్కూటీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# కడుపులో కత్తులు పెట్టుకొని రాజకీయాలా



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కడుపులో కత్తులు పెట్టుకొని రాష్ట్రంలో బీజేపీ రాజకీయం చేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఇందిరా పార్క్ వద్ద బీజేపీ చేపట్టిన మహా ధర్నాపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ కట్టుబడి ఉందని అన్నారు.కానీ, ముస్లింల పేరిట బలహీనవర్గాలకు బీజేపీ తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టిందని ఆరోపించారు. బీసీకు న్యాయం చేయాలనే అలోచనే ఉంటే.. బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఢిల్లీకి వెళ్లి తెలంగాణలో 42 బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా నేడు బలహీనవర్గాల బద్ద వ్యతిరేకి రాంచందర్ రావు చేపట్టిన మహాధర్నాలో పాల్గొని వారంతా బీసీ వ్యతిరేకులుగా మారారని కామెంట్ చేశారు. నాడు ప్రత్యేక రాష్ట్రం కోసం ఎలా అయితే పోరాటం చేశామో.. నేడు బీసీ రిజర్వేషన్లపై కూడా అదే మాదిరిగా కాంగ్రెస్ పోరాటం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# క్రిమినల్ కేసు నమోదుకు కోర్టు ఆదేశం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని నాంపల్లి కోర్టు మంత్రి కొండా సురేఖపై కీలక తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం దావా కేసులో సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు BNS సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకోబడగా, BNSS సెక్షన్ 222 r/w 223 ప్రకారం నేరాన్ని స్వీకరించాలని కోర్టు నిర్ణయించింది.కోర్టు ఆదేశాల ప్రకారం, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, సమంత విడాకుల వంటి అంశాలపై కేటీఆర్ పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలు ప్రాథమికంగా నిరాధారమని భావించింది. కేటీఆర్ తరపున న్యాయవాది సిద్ధార్థ్ పోగుల సమర్పించిన వాదనలను కోర్టు సమర్థించింది. సాక్ష్యులు (PW1 నుండి PW5) ఇచ్చిన వాంగ్మూలాలు, సమర్పించిన పత్రాలు, ఫిర్యాదును పరిశీలించిన తర్వాత, సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయడానికి తగిన ఆధారాలు ఉన్నట్లు గుర్తించింది.కొండా సురేఖ తరపు వాదనలను తోసిపుచ్చిన కోర్టు.. రేఖ తరపు న్యాయవాది లేవనెత్తిన పలు అంశాలను కోర్టు తిరస్కరించింది. ఫిర్యాదు ఊహాగానాలపై ఆధారపడిందన్న వాదనను అంగీకరించలేదు. పెన్ డ్రైవ్ కు 65-B సర్టిఫికేట్ అవసరం అనే వాదనను ఈ దశలో అప్రస్తుతమని తేల్చింది. విచారణ సమయంలో అది పరిశీలిస్తామని స్పష్టం చేసింది.సురేఖ చేసిన వ్యాఖ్యలు మీడియాలో ముందే వచ్చాయన్న వాదనకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. ఈ పరిశీలనలన్నింటి తర్వాత, నాంపల్లి కోర్టు 2025 ఆగస్టు 21 లోపు క్రిమినల్ కేసు నమోదు చేసి, నిందితురాలికి నోటీసు జారీ చేయాలని పోలీసులకు ఆదేశించింది. హైకోర్టు ఆదేశం (క్రిమినల్ పిటిషన్ నెం. 5670/2024) ప్రకారం కోర్టుకు ఈ అధికారం ఉందని కూడా తీర్పులో పేర్కొంది.ఈ తీర్పుతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. కేటీఆర్ ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, కోర్టు ఆదేశం మంత్రి సురేఖకు పెద్ద షాక్ గా మారింది. ఇకపై కేసు న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్తుందో రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సంపాదకీయం

# బిల్లు.. చట్టం ముందు నిలిచేనా..?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285Aను సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేష న్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయిం చింది. అయితే ఈ ప్రయత్నం రాజకీ యంగా ఆకర్షణీయమైనప్పటికీ, రాజ్యాంగబద్ధమైన పరిమితులు, సుప్రీంకోర్టు తీర్పులు, గత అనుభవాలు దీని చట్టపరమైన బలాన్ని సందేహాస్ప దంగా చేస్తున్నాయి.ఈ వ్యాసం బీసీ రిజర్వేషన్ల చరిత్ర, రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులు, తెలంగాణ జనాభా డేటా, తమిళనాడు మోడల్ ను పరిశీలిస్తూ, సామాజిక న్యాయం కోసం సాధ్యమైన మార్గాలను సమగ్రంగా విశ్లేషిస్తుంది.భారత రాజ్యాంగం ఆర్టికల్ 38 ప్రకారం, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడానికి బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేయాలి. ఆర్టికల్ 15(4), 16(4)లు విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజ ర్వేషన్లను కల్పించే అధికారాన్ని రాష్ట్రాలకు ఇస్తాయి. అయితే, బీసీ రిజర్వేషన్ల చట్టపరమైన ప్రయాణం అనేక సవాళ్లను ఎదు ర్కొంది. మొదటగా చంపకం దొరై రాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు (1951), ఈ కేసులో తమిళనాడులో బీసీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు చెల్లవని తేల్చింది. దీనివల్ల ఆర్టికల్ 15(4)ను చేర్చేందుకు మొదటి రాజ్యాంగ సవరణ జరిగింది. ఇక అనంతరామన్ కమిషన్ (1970), బీసీలకు రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయ ఆధారాలను సిఫారసు చేసింది. అలాగే ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1992) ప్రకారం, రిజర్వేషన్లు 50 శాతం సీలింగ్ ను మించకూడదని, కులాన్ని బీసీల గుర్తింపుకు ప్రధాన ఆధారంగా పరిగణించ వచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కృష్ణమూర్తి కేసు (2010) ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లకు 'ట్రిపుల్ టెస్ట్' (సమగ్ర సర్వే, శాస్త్రీయ డేటా, 50% సీలింగ్) నిబంధనను పేర్కొంది. జై శ్రీలక్ష్మణరావు పాటిల్ వర్సెస్ స్టేట్ఆఫ్ మహా రాష్ట్ర (2021) ప్రకారం మహారాష్ట్రలో మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్ 50% సీలింగ్ ను మించినందున రద్దు చేయబడింది. మహారాష్ట్ర స్థానికసంస్థల కేసు (2021) 27 శాతం బీసీ రిజర్వేషన్ కూడా సీలింగ్ ను మించినందున కొట్టివేయబడింది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్లు 29 శాతం. వాటిని 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత రిజర్వేషన్లను కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ పార్టీనే ప్రభుత్వం ఏర్పచగా ఇచ్చిన హామి మేరకు 42 శాతం రిజర్వేషన్ కు సవరణ ప్రయత్నం జరుగుతోంది, కానీ ఇది చట్టపరమైన సమీక్షలో నిలబడే అవకాశం తక్కువ. ఎందు కంటే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే పూర్తి చేసినప్పటికీ, డేటా బయట పెట్టలేదు. రాష్ట్రంలో బీసీలు జనాభాలో సగానికి పైగా ఉన్నప్పటికీ, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. అయితే, ఈ కుల గణన డేటా బహిర్గతం కాకపోవడం వల్ల, అత్యంత వెనుకబడిన కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను గుర్తించడం కష్టం. అలాగే తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్, ఎస్సీ (15.45%), ఎస్టీ (9.34%) రిజర్వే షన్లతో కలిపితే 66.79%కు చేరుతుంది, ఇది 50% సీలింగ్ ను మించుతుంది. డేటా విడుదల చేయకపో వడంతో శాస్త్రీయ ఆధారాలు లేవని ఈ రిజర్వేషన్ చట్టప రమైన సమీక్షలో రద్దయ్యే ప్రమాదం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలు 12,900 గ్రామ పంచాయతీలకు పరిమితం. కానీ ప్రభుత్వం 2026 నాటికి లక్ష ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటన చేసింది. ఆ లోపు 42 శాతం రిజర్వేషన్ అమలు కాకపోతే బీసీలు తీవ్ర నష్టం చవి చూస్తారు. విద్య, ఉద్యోగ రంగాల్లో వేలాది బీసీలు అవకాశాలను కోల్పోతారు.తమిళనాడు 69 శాతం రిజర్వేషన్ ను (ఎస్సీ18%, ఎస్టీ1%, బీసీ 50%) అమలు చేస్తోంది, ఇది 50% సీలింగ్ ను అధిగ మించింది. ఈ విజయం వెనుక కారణాలు.. అంబ శంకర్ కమిషన్ (1980). ఆ కమిషన్ నివేదిక ప్రకారం ఎం.జి. రామచంద్రన్ బీసీ రిజర్వేషన్ ను 31% నుండి 50%కి పెంచారు. అగ్రకులాల నిరసనలు, సుప్రీంకోర్టు పిటిషన్ల తర్వాత, అంబశంకర్ కమిషన్ శాస్త్రీయ డేటాతో రిజర్వే షన్ ను సమర్థించింది. ఇక జయలలిత చొరవతో ఆ రాష్ట్రంలో రిజర్వేషన్ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చారు. దీనివల్ల సుప్రీంకోర్టు సమీక్ష నుండి రక్షణ లభించింది. తెలంగా ణలోనూ తమిళనాడు మాదిరిగా 42 శాతం రిజర్వేషన్ అమలు కావాలంటే కుల గణన డేటాను బహిర్గతం చేసి, అత్యంత వెనుకబడిన కులాల స్థితిగతులను శాస్త్రీయంగా నిర్ధారించాలి. అలాగే అంబ శంకర్ కమిషన్ తరహాలో రిజర్వేషన్ ను సమర్థించే స్వతంత్ర కమిషన్ నివేదికను సిద్ధం చేయాలి. రాజకీయ వ్యూహంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ సమైక్యతను ప్రదర్శించి అఖిలపక్ష సమావేశం బీఆర్ఎస్, బీజేపీతో సహా అన్ని పార్టీల మద్దతును సమీకరించి, ఏకాభిప్రాయం కుదర్చాలి. అన్నీ పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి ఈ రిజర్వేషన్ ను 9వ షెడ్యూల్ లో చేర్చేందుకు చొరవ తీసుకోవాలి. బీసీ సమాజం అప్రమత్తంగా ఉండి, రాజ్యాంగ బద్ధమైన ఉద్యమం ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సాధించాలి.

# పీఎం ప్రణయ్ పునరుజ్జీవం ఇచ్చేనా?

వ్యవసాయ భూములలో జీవ శక్తి తగ్గిపోతోంది, మట్టిలోని సూక్ష్మ జీవుల ఉనికి క్రమంగా క్షీణిస్తోంది, ఎరువుల ఖర్చులు రైతుకి భారం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రకృతికి అనుకూలమైన వ్యవసాయానికి అవసరం పెరిగింది.గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడు తున్నారు. దీని వల్ల పంటల్లో తాత్కాలికంగా దిగుబడి పెరిగినప్పటికీ, మట్టిలో జీవశక్తి తగ్గిపోతోంది. దీర్ఘకాలంగా ఇది మానవ ఆరోగ్యం పైనా ప్రభావం చూపిస్తోంది. అందుకే ప్రత్యామ్నాయ ఎరు వుల వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఏర్పడింది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఓ కీలకమైన నిర్ణయమే... ప్రధానమంత్రి ప్రాణమ్ పథకం.2023 జూన్ 28న కేంద్ర వ్యవసాయ శాఖ ఈ పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా ఈ పథకం మూడు ప్రధాన లక్ష్యాలపై దృష్టిపె డుతోంది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు సేంద్రియ, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం ఈ పథకంలో ముఖ్యమైన అంశం ఇన్ సెంటివ్ మెకానిజం. అంటే ఏ రాష్ట్రం రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే, ఆ రాష్ట్రానికి కేంద్రం ఆదా అయిన సబ్సిడీలో 50% మళ్లీ గ్రాంట్ గా ఇస్తుంది. అందులో 70% జీవన ఎరువులు మౌలిక సదుపాయాల అభివృద్ధికి, 30% అవగాహన కార్యక్రమాలు, రైతుల శిక్షణకు వినియోగించవచ్చు. అంటే దీని ద్వారా రాష్ట్రాలకు ప్రోత్సాహం, రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం, ప్రకృతికి రక్షణ అన్నీ సాధ్యప డతాయి.2024 ఆగస్టు 9 నాటికి అన్ని రాష్ట్రాలు ప్రాణమ్ పథకంలో చేరాయి. గోభర్ధన్ యూనిట్ల నుండి వచ్చే సేంద్రియ ఎరువులకు రూ.1500 టన్నుకు ప్రోత్సాహకం. 2023లో రూ.1451.84 కోట్లు మార్కెట్ అభివృద్ధి సహాయంగా కేటాయించబడ్డాయి. యూరియా గోల్డ్ (సల్ఫర్ కోటెడ్ యూరియా) లాంటి ఉత్పత్తులు నేల పోషక లోపాలు తీర్చే లక్ష్యంతో తీసుకు వచ్చారు. కానీ పథకం విజయవంతం కావాలంటే కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. అన్ని రాష్ట్రాలు వాస్తవంగా ఎరువుల వినియోగం తగ్గించగలవా? బయో ఎరువుల సరఫరా, నాణ్యతపై రైతులకు నమ్మకం ఏర్పడిందా? అంతర్జాతీయ ఎరువుల దిగుమతులపై ఆధారాన్ని దేశీయంగా తగ్గించగలమా? ఈ అంశాలపై స్పష్టమైన కార్యాచరణ లేకుంటే, ఎంత మంచి పథకం అయినా ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు.పునరుత్పాదక వ్యవసాయం అనేది ఫలిత-ఆధారిత ఆహార ఉత్పత్తి వ్యవస్థ, ఇది నేల ఆరోగ్యాన్ని పెంపొందించి వాతావరణం, నీటి వనరులతోపాటు జీవవైవిధ్యాన్ని రక్షిస్తుంది. పొలాల ఉత్పాదకతను లాభదాయకతను పెంచుతుంది.రసాయన ఎరువులపై సబ్సిడీ భారం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సుమారు ₹2.25 లక్షల కోట్లు ఉండటం గమనించదగ్గ విషయం, ఇది 2021-22 ఆర్థిక సంవత్సరం (₹1.62 లక్షల కోట్లు) కంటే 39 శాతం ఎక్కువ. 2012-13 నుండి 2021-22 వరకు నత్రజని ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గలేదని చూపిస్తుంది. అయితే, సబ్సిడీ బిల్లు గణనీయంగా పెరిగింది. కాబట్టి, ప్రాణమ్ ను ప్రోత్సహించడం వల్ల ప్రభుత్వం సబ్సిడీ బిల్లులను, ఆర్థిక లోటును తగ్గించడంలో సహాయప డుతుంది. రసాయన ఎరువులపై సబ్సిడీలను క్రమంగా తొలగించడం ప్రత్యామ్నాయ లేదా బయో-ఎరువుల స్వీకరణను ప్రేరేపిస్తుంది.రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి, రైతులకు ప్రత్యక్ష లాభం కనబడేలా వినియోగం, అవగాహన పెరగాలి. రైతు శిక్షణ కేంద్రాలు, డెమో ప్రాజెక్టులు ఏర్పడాలి. ఐ.ఎఫ్.ఎం.ఎస్, ఈ.ఎఫ్.ఎం.ఎస్ వంటి డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు సమర్థవంతంగా అమలు కావాలి. రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యూనివర్సిటీలను భాగస్వాములుగా మార్చాలి. ఈ పథకం సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పునరుజ్జీవానికి ఊపిరినిస్తుంది. ఇది ఎరువులపై ఆధారపడే వ్యవసాయం నుంచి స్వయం సమృద్ధ వ్యవస్థల వైపు భారత వ్యవసాయం అడుగులు వేయడానికి అవకాశంగా మారాలి. ఇది కేవలం ఒక పథకం మాత్రమే కాదు ప్రకృతితో మానవుడి పునఃసంబంధానికి సంకేతం. దీని వలన రైతుకు మేలు జరుగుతుంది, భవిష్యత్తు తరాలకి ఆరోగ్యం లభిస్తుంది. మట్టిలో జీవం వుంటేనే మానవాళికి జీవితం ఉంటుందనే వాస్తవాన్ని విస్మరిం చవద్దు.

# నేతల పార్టీ జంప్ కు చెక్ పడే మార్గమేంటి ?

పార్టీ ఫిరాయింపుల విషయంలో నిర్దేశిత గడువులోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్పీకర్ విచారణకు ఆటంకాలు కలిగించొద్దని, పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు అనర్హత విచారణ ఎదుర్కో వాల్సిందేనని ఆదేశించింది. అనర్హత పిటిషన్లు ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉంచడం సరికాదని, అలాచేస్తే రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లే అవుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విచారణ పొడిగించడానికి ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే.. స్పీకర్ ప్రతికూల నిర్ణయం తీసుకోవచ్చునని కూడా న్యాయస్థానం పేర్కొంది. ఇదే సమయంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. స్పీకర్ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు.. పార్టీ ఫిరాయింపులను అడ్డుకునేందుకు పార్లమెంట్ చట్టం తీసుకురావాలని అభిప్రాయ పడింది.2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై విజయం సాధించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ లు కొంతకాలం తరువాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్ ను కోరారు. అయినా, స్పీకర్ నుంచి ఎలాంటి స్పందన రాకపో వటంతో.. పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం దేశవ్యాప్తంగా సరికొత్త చర్చకు దారి తీసింది. హైకోర్టులో మొదలైన విచా రణపర్వం.. చివరగా సుప్రీంకోర్టు వరకు వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల తరుణంలో ఈ కేసుపై అనేక కోణాల్లో చర్చ మొదలైంది. అసలు స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. సుప్రీం సూచించిన గడువులోపు స్పీకర్ నిర్ణయం తీసుకో కపోతే.. కోర్టే ఏం చేయబోతుందనేది కూడా చర్చనీ యాంశంగా మారింది.2023లో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ 39 స్థానాలతో ప్రతిపక్షంలో ఉంది. అయితే కొద్ది నెలల వ్యవధిలోనే బీఆర్ఎస్ కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయాన్ని బీఆర్ఎస్ సీరియస్ గా తీసుకుంది. వీరిపై చర్యల కోసం న్యాయపోరాటానికి దిగింది. ఆ పార్టీకి చెందిన నేతలు 2024 ఏప్రిల్లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ మారిన వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరారు. దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సైతం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ విచారణ జరిపింది. 2024 సెప్టెంబర్ లో స్పీకర్ ఆఫీస్ కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో విచారణ షెడ్యూల్ ఇవ్వాలని ఆదేశించింది.లేదంటే తామే సుమోటో కేసుగా తీసుకుని విచారిస్తామని స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేయడానికి డివిజన్ బెంచ్ లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. స్పీకర్ కు టైమ్ బాండ్ లేదని ధర్మాసనం పేర్కొంది. పదో షెడ్యూల్ ప్రకారమే నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు సూచించింది.హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై జనవరి 2025లో కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.వీరి పిటిషన్లపై ఫిబ్రవరిలో విచారించిన కోర్టు ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది.రీజనబుల్ టైం అంటే ఎంతో కచ్చితంగా చెప్పాలంటూ తెలంగాణ స్పీకర్ ను కోరింది. ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ దృష్టికి వెళ్లి పది నెలలు అవుతోంది. ఇంకెంత సమయం కావాలి? అంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టు 10 మంది ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కు కూడా నోటీసులు జారీ చేసింది. వీరి తరపు వాదనలను కూడా వినింది. ఏప్రిల్ 3వ తేదీన వాదనలు పూర్తి చేసిన అత్యున్నత ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. జూలై 31న వెలువరి స్తామని పేర్కొంది. చివరకు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాల్సిందని, స్పీకర్ కు 3 నెలలతో కూడిన కాలపరిమితి విధిస్తూ సుప్రీం కోర్టు తీర్పును వెలువ రించింది.పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టులో ఆసక్తికర వాదనలు జరిగాయి. ప్రస్తుతం స్పీకర్ తరపున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. స్పీకర్ విశేషాధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదని.. స్పీకర్ నిర్ణయం తీసుకున్న తరువాతే న్యాయ సమీక్షకు అవకాశం ఉందన్నారు. ఫిరాయింపులపై హైకోర్టు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని.. అక్కడ కేసు పెండింగ్ లోనే ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముకుల్ రోహత్గి వాదనలు గతంలో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులకు భిన్నంగా ఉందని జస్టిస్ బిఆర్ గవాయ్ అన్నారు. స్పీకర్ కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికా రాలను కోర్టులు హరించలేవని ముకుల్ రోహత్గి వాదించారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే కోర్టులు జోక్యం చేసుకోకూడదా అని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. స్పీకర్ ఐదేళ్ల వరకూ నిర్ణయం తీసుకోకపోతే అంతవరకూ కోర్టులు నిర్ణయం తీసుకోకూడదా అని నిలదీశారు. అందుకు ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదని ముకుల్ రోహత్గి తెలిపారు. అయితే స్పీకర్ కు సరైన సమయంలో నిర్ణయం తీసుకోమని విజ్ఞప్తి చేయడమో, ఆదేశించడమో కోర్టులు చేయకూడదా అని ముకుల్ ను జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశ్నించారు.ఫిరాయింపులపై పిటీషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని.. రోహత్గి తెలిపారు. స్పీకర్ పై నమ్మకం లేక రిట్ ల పైన రిట్ లు దాఖలు చేయడం ఎందుకు?...స్పీకర్ నిర్ణయం తీసుకునేంత వరకూ ఎందుకు పిటీషనర్లు ఆగరని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కు ఫిర్యాదు చేసిన వారంలోనే కోర్టులో పిటిషన్ వేశారని కోర్టుకు తెలిపారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారన్నారు. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా కోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారన్నారు. సింగిల్ జడ్జి బెంచ్ నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయాలని చెప్పిందని.. ఆ ఆదేశాలను డివిజన్ బెంచ్ కొట్టేసిందని తెలిపారు. రోహత్గి వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని న్యాయమూర్తి స్పష్టం చేశారు. స్పీకర్ చర్య తీసుకోకపోతే.. నాలుగు సంవత్సరాలు స్పీకర్ ఏమీ చేయకపోతే, కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.మొత్తం మీద ఫిరాయింపుల విషయంలో ఏదొకటి తేల్చాలని సుప్రీం స్పీకర్ కు గడువు పెట్టడంతో.. రాబోయే 90 రోజుల్లో ఏం జరుగుతుందనేది ఉత్కంఠకు దారితీస్తోంది.

# సిందూర్ విజయాలు, పాలకుల వైఫల్యాలు

పార్లమెంటు ఉభయ సభలలో గత వారం ఆపరేషన్ సిందూర్ పై చర్చ జరిగింది. ఆ సైనిక చర్య లక్ష్యాలు నెరవే రాయని, తత్కారణంగా దాన్ని తుదకు (తాత్కాలికంగా) విరమించడం జరిగిందని, మన సైనిక కార్యకలాపాలు సాధా రణమైన క్రమ పద్ధతికి వచ్చాయనే అభిప్రాయాన్ని ప్రభుత్వం కలిగించింది. పరిస్థితి నిజంగా అలా ఉన్నదా? లేదు. ప్రభుత్వం కలిగించిన అభిప్రాయం తప్పు. నిజమేమిటంటే మన సైన్యం ఒక కఠినమైన ఆట ఆడుతుండగా ప్రభుత్వం బలవంతంగా బంతిని లాక్కోవడం జరిగింది! మన సైనిక దళాల ధైర్య సాహసాలకు జేజేలు. ఆపరేషన్ సిందూర్ కొన్ని కట్టుకథలను బద్దలుగొట్టింది. అపోహలు, తప్పుడు నమ్మకాలను తొలగించింది. పాకిస్థాన్ పై యుద్ధం, విజయ సాధన చాలా సులభం; సంప్రదాయ యుద్ధంలో భారత్ ఆధికృత చెక్కు చెదరకుండా కొనసాగుతుంది; భారత్ కు ప్రపంచ వ్యాప్తంగా మిత్ర దేశాలు ఉన్నాయి, పాకిస్థాన్ కు శ్రేయోభిలాషులు ఎవరూ లేరు మొదలైనవే ఆ కట్టుకథలు.మన సైనిక దళాల నాయకత్వం విలక్షణరీతిలో వ్యవహరించింది. సైనిక చర్యలకు ఉదాహరణప్రాయంగా ఆపరేషన్ సిందూర్‌ను అవి నిర్వహించాయి. సైనిక కార్యాచరణ విషయంలో స్వేచ్ఛనివ్వాలని ప్రభుత్వాన్ని సైన్యం కోరింది. సైన్యం అభ్యర్థనను సర్కార్ అంగీకరించింది. సైనిక చర్యకు సంకల్పించింది, తొట్ట తొలుత రంగంలోకి దిగింది భారత సైన్యమే గనుక దానికి సహజంగానే ప్రారంభ సానుకూల ప్రయోజనాలు దక్కాయి: పాకిస్థాన్ భూభాగా లలోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది వేర్వేరు ఉగ్రవాద స్థావరాలపై కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలో చేసిన దాడులు సంపూర్ణంగా విజయవంతమయ్యాయి. ఉగ్రవాద కార్యకలాపాల సదుపాయాలు, సాధనాలు సమస్తమూ ధ్వంసమైపోవడంతో పాటు పలువురు ఉగ్రవాదులు హతులయ్యారు. అయితే పాకిస్థాన్ సైనిక దళాలు త్వరితగతిన కోలుకున్నాయి. చైనాలో తయారైన యుద్ధ విమానాలు (జె–10), చైనా ఉత్పత్తి చేసిన మిస్సైల్స్ (పి–15), తుర్కియే సరఫరా చేసిన డ్రోన్‌లతో మే 7–8 రాత్రి, పాకిస్థాన్ ప్రతిదాడులు నిర్వహించింది.తమ వ్యూహ సంబంధిత లోపాలు, లొసుగులను మన సైనిక దళాల నాయకత్వం వెన్వెంటనే గుర్తించి, కొత్త యుద్ధ తంత్రంతో పాకిస్థాన్‌ను ఎదుర్కొన్నది. అదీ సరైన, సమర్థ నాయకత్వం. పునః ప్రారంభమైన సైనిక చర్యలు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని 11 సైనిక వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సహజంగానే భారత సైన్యానికి కొన్ని నష్టాలు వాటిల్లాయి. అత్యున్నతస్థాయి సైనికాధికారులు ఈ వాస్తవాన్ని అంగీకరించారు. ఇది, సమర్థ నాయకత్వానికి మరొక ఉదాహరణ. మరి మన రాజకీయ నాయకత్వం కూడా సైనిక నాయకత్వం మాదిరిగా వ్యవహ రించిందా? లేదు. తన తప్పులను అంగీకరించలేదు. నష్టాలు వాటిల్లినట్టు ఒప్పుకోలేదు (తలను ఇసుకలో దూర్చి తననెవరూ చూడటం లేదని భావించే) ఉష్ట్రపక్షిలా మన రాజకీయ నాయకత్వం వ్యవహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఒక 'నిర్ణయాత్మక విజయం' సమకూరిందని పదే పదే ప్రకటించింది. నిజమేనా? నిర్ణయాత్మక విజయం సమకూరి ఉన్నట్టయితే తనకు సానుకూలంగా ఉన్న పరిస్థి తులను మరిన్ని సైనిక విజయాల సాధనకు ఎందుకు ఉపయో గించుకోలేదు? పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి రాజకీయ రాయితీలను డిమాండ్ చేసి ఎందుకు పొందలేదు? పాకిస్థాన్ డీజీఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ఫోన్ చేసీ చేయగానే ఎందుకు సానుకూలంగా ప్రతిస్పందించారు? కాల్పుల విరమణకు షరతులు ఎందుకు విధించలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవు (యుద్ధంలో ఒక నిర్ణయాత్మక విజయానికి తిరుగులేని ఉదాహరణ డిసెంబర్ 16, 1971న పాకిస్థాన్ సైనికాధికారి జనరల్ నియాజీ భారత సైనికాధికారి జనరల్ అరోరాకు లొంగిపోవడం).ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నెలకొన్న ఒక వాస్తవాన్ని మన రాజకీయ నాయకత్వం అంగీకరిం చలేదు: పాకిస్థాన్, చైనాలు తమ సైనిక, రాజకీయ సంబంధాలను మరింతగా పటిష్ఠం చేసుకున్నాయి. పాకిస్థాన్‌కు కొత్త తరం యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ను చైనా సరఫరా చేస్తోంది. తాము ఉత్పత్తి చేసిన సైనిక సామగ్రి మన్నికను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనా పరీక్షించు కున్నది. బీజింగ్–ఇస్లామాబాద్ సైనిక బంధం ఆపరేషన్ సిందూర్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి 'ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిశ్చయాత్మక చర్య'ను ప్రశంసించారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు చైనా సంపూర్ణ మద్దతునిచ్చింది.అమెరికాతో పాకిస్థాన్ (కనీసం పాకిస్థాన్ సైన్యం) బంధం మరింతగా దృఢ తరమవడం మరొక వాస్తవం. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌ను అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందుకు ఆహ్వానించారు. దేశ సార్వభౌమాధినేత లేదా ప్రభుత్వాధినేత కాని వ్యక్తులకు మున్నెన్నడూ ఇటువంటి గౌరవం లభించలేదు. 'యుద్ధాన్ని కొనసాగించకుండా, ముగించి నందుకు జనరల్ మునీర్‌కు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పారు. తన విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్‌లు అంగీ కరించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. ఆపరేషన్ సిందూర్ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలను ప్రధానమంత్రి, హోం మంత్రి ఘాటుగా విమర్శించారే గానీ అమెరికా, చైనా అధ్యక్షులు, వారి విదేశాంగ మంత్రుల ప్రకటనలను ఖండించే సాహసం చేయలేకపోయారు. ప్రతిపక్షాల విమర్శలు నిరాధార మైనవని ఎందుకు నిరూపించలేకపోయారు? అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిక్యతకు పోటీపడుతున్న అమెరికా, చైనాలు పాకిస్థాన్‌ను సైనికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకో వడంలో ఒకే విధంగా వ్యవహరించాయన్నది మరొక విస్మరిం చలేని వాస్తవం. ఈ రెండు దేశాలు తమ విభేదాలు విస్మరించి పాకిస్థాన్‌కు మద్దతునిచ్చేందుకు, ప్రోత్సహించేందుకు అంగీక రించాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే పహల్గాం దాడిలో పాకిస్థాన్ ప్రమేయాన్ని చాటి చెప్పేందుకు ప్రపంచ దేశాలకు భారత ప్రభుత్వం పంపిన దౌత్య ప్రతినిధుల బృందాలు తమ లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించలేక పోయాయి. ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని, భారత్‌కు సానుభూతిని వ్యక్తం చేశాయేగానీ ఆ దుర్మార్గానికి పాకిస్థాన్‌దే బాధ్యత అని ఏ ఒక్క దేశమూ ఖండించనేలేదు. ఈ వాస్తవాలను అంగీకరించేందుకు భారతదేశ రాజకీయ నాయకత్వం తిరస్కరిస్తోంది. పాకిస్థాన్‌కు మిత్ర దేశాలు లేవని, భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా మిత్రులు ఉన్నారనే భ్రమలోనే ఇప్పటికీ ఉన్నది! జమ్మూ–కశ్మీర్‌లో ఉగ్ర ఆవరణం (టెర్రర్ ఎకోసిస్టమ్ – ఉగ్రవాద ఆవిర్భావం, వ్యాప్తి, నిలకడకు దోహదం చేసే పరస్పర అను సంధానిత కారకాల సంక్లిష్ట వ్యవస్థ) ధ్వంసమై పోయిందనే భ్రమలో కూడా దేశ రాజకీయ నాయకత్వం ఉన్నది. సత్యం భిన్నంగా ఉన్నది, సందేహం లేదు. పహల్గాం ఉగ్రదాడి (ఏప్రిల్ 22, 2025) సంభవించిన రెండు రోజుల అనంతరం (ఏప్రిల్ 24) ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ ఈ క్రింది వివరాలు వెల్లడించింది: జూన్ 2014– మే 2024 మధ్య కశ్మీర్‌లో 1643 ఉగ్రవాద సంఘటనలు, 1925 చొరబాటు ప్రయత్నాలు, 726 సఫల చొరబాట్లు సంభవించాయి; 576 మంది భద్రతా సిబ్బంది హతమయ్యారు. అటల్ బిహారీ వాజపేయి (1998–2004), మన్మోహన్‌సింగ్ (2004–2014) ప్రధాన మంత్రిత్వాల కాలంలో కూడా ఉగ్రవాద దాడులు సంభవించాయి, హతులు, క్షతగాత్రులు గణనీయంగా ఉన్నారు.ఉగ్ర ఆవరణంలో ఉన్నదెవరు? పాకిస్థాన్ నుంచి భారత భూభాగాల్లోకి చొరబడినవారు, భారత్‌లో, ముఖ్యంగా కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నవారు. ఈ రెండు వర్గాలవారు తరచు కలిసికట్టుగా పనిచేస్తున్నారు, కలి సికట్టుగా ఉగ్ర చర్యలకు పాల్పడుతున్నారు, పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. ఏప్రిల్ 26, 2025న ప్రభుత్వం కశ్మీర్ లోయలో పలు గృహాలను కూల్చి వేసింది. 'పహల్గాం ఊచకోతతో సంబంధమున్న ఉగ్రవాదులు' అని అనుమానించిన వారి గృహాలను కూల్చివే సినట్టు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కూల్చివేతకు గురైన గృహాల యజమానులు భారతదేశానికి చెందిన ఉగ్రవాదులే. జూన్ 2025లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఉగ్ర వాదులుగా అనుమానిస్తున్న వారికి ఆశ్రయమిచ్చినందుకు ఇద్దరు భారతీయులను అరెస్ట్ చేసింది. జూలై 27–28న ఉగ్రవాదులు అని శంకిస్తున్న వ్యక్తులను నిరాయుధులను చేసి, వారు చొరబాటుదారులు అని గుర్తించారు. భారతదేశానికి చెందిన ఉగ్రవాదులు గతంలో ఉగ్రవాద హింసాకాండకు పాల్పడ్డారు. 2006లో ముంబై సబర్బన్ రైలులో బాంబు పేలుళ్లు, 2008లో తాజ్‌మహల్ హోటల్‌పై దాడి, 2011లో జావేరీ బజార్ ఘటన సదరు ఉగ్రవాద హింసాకాండకు ఉదా హరణలు. 2006 ఉగ్రవాద దుర్మార్గానికి పాల్పడింది భారత్‌కు చెందిన ఉగ్రవాదులే. 2008 ఘటనకు పాల్పడి నవారు కసబ్‌తో సహా పది మంది పాకిస్థానీ చొరబాటు దారులు. 2011 ఘటన భారత్‌కు చెందిన ఉగ్రవాదుల క్రూర కృత్యమే. భారత్‌లో ఉగ్ర ఆవరణాన్ని (టెర్రర్ ఎకోసిస్టమ్) నిర్మూలించినట్టు ప్రభుత్వం చేస్తున్న వాదన నిస్సందేహంగా తప్పు. ప్రభుత్వ వాదన నిజమే అయితే పహల్గాం దాడి ఎలా సంభవించింది? గూఢచార వర్గాల వైఫల్యం, పహల్గాంలో భద్రతా దళాలు లేకపోవడం వల్లే ఏప్రిల్ 22న ఆసేతు హిమాచలం ప్రతి ఒక్కరినీ కలచివేసిన బీభత్స విషాదం చోటు చేసుకున్నది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఏ ఒక్కరూ ఆ అమానుష హింసాకాండకు బాధ్యత తీసుకోలేదు. ఇది గర్హనీయం కాదా? పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహ సాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత్ రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసిం చవచ్చు.

# కుల్గాంలో ఎన్‌కౌంటర్..



**ఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ సైన్యం ముష్కరుల భరతం పడుతోంది. ఒక్కొక్కరిని ఏరివేస్తోంది. ఇటీవల శ్రీనగర్ లో ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ముగ్గురు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టారు. పహల్గామ్ కీలక సూత్రదారి సులేమాన్ సహా మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. తాజాగా శనివారం ఆపరేషన్ అఖల్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు.జమ్మూ కాశ్మీర్ లోని కుల్గాం జిల్లాలోని అఖల్ ప్రాంతంలో భద్రతా దళాలు- ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసు కున్నాయి. ఈ ఎన్ కౌంటర్ లో ఒక ఉగ్రవాది హతమైనట్లు భారత సైన్యానికి చెందిన చినార్ కార్ప్స్ శనివారం తెలిపింది. ఆర్మీ, జమ్మూ కాశ్మీర్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది.శుక్రవారం అఖల్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు తిష్ట వేసినట్లు సైన్యానికి పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో సైన్యంపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సైన్యం కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతం కాగా.. మరికొందరి కోసం గాలిస్తున్నారు.ఏప్రిల్ 22న పహల్గామ్ లో ఉగ్రవాదులు.. 26 మందిని పొట్టనపెట్టు కున్నారు. అనంతరం భారత ప్రభుత్వం.. మే 7న పాకిస్థాన్ పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఇక జూలై 28న ఆపరేషన్ మహాదేవ్ లో పహల్గామ్ ఉగ్రవాదులు హతం అయ్యారు.

# కేరళ నన్స్‌కు బెయిల్

**ఛత్తీస్ గఢ్:** ఛత్తీస్ ఘఢ్ లోని బిలాస్ పూర్ లో మానవ అక్రమ రవాణా, మత మార్పిడి ఆరోప ణలపై ఇటీవల అరెస్టయిన కేరళకు చెందిన ఇద్దరు క్రిస్టియన్ నన్స్ కు స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 143, ఒరిస్సా మత స్వేచ్ఛా చట్టం, 1967లోని సెక్షన్ 3 కింద నన్స్ మీద కేసు నమోదు చేశారు.అయితే, నన్స్ మీద పెట్టిన BNS సెక్షన్ 143 మానవ అక్రమ రవాణా కేసు.. నన్స్ విషయంలో వర్తించదని కోర్టులో వాదించామని, దీనిపై సానుకూలంగా స్పందించిన కోర్టు ఇద్దరు నన్స్‌కి ఈరోజు(శనివారం) బెయిల్ మంజూరు చేసిందని నన్స్ తరపున వాదిస్తున్న న్యాయవాది గోప కుమార్ చెప్పారు. అయితే, వీరిద్దరూ దేశం విడిచి వెళ్లరాదని, ఒక్కొక్కరికి రూ. 50,000 బెయిల్ బాండ్ అందించాలని కోర్టు నిబంధనలు పెట్టిందని ఆయన తెలిపారు.ఈ కేసు డీల్ చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) తరపున వాదిస్తున్న న్యాయవాది కూడా బెయిల్ ఇచ్చిన విషయాన్ని ధృవీకరించారు. అయితే, కోర్టు ఇచ్చిన 'బెయిల్ ఆర్డర్'లో ఇద్దరు నన్స్ భారతదేశం విడిచి వెళ్లకూడదని, దర్యాప్తును ప్రభావితం చేయకూడదు అనే షరతులు కోర్టు విధించిందని ఎన్ఐఏ న్యాయవాది చెప్పారు. బెయిల్ మంజూరుకు సంబంధించి తమకు కోర్టు ఉత్తర్వు అందిందని, దానిని సవివరంగా అధ్యయనం చేస్తామని NIA న్యాయవాది తెలిపారుకాగా, నిన్న (శుక్రవారం) ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్ జిల్లాలోని ప్రత్యేక NIA కోర్టు ఈ కేసులో ఇద్దరు నన్స్ సహా ముగ్గురు వ్యక్తుల బెయిల్ దరఖాస్తును స్వీకరించింది. కోర్టు తన తీర్పును నేటికి(శనివారానికి) రిజర్వ్ చేసింది. నిందితులు బలవంతంగా మత మార్పిడికి లేదా మానవ అక్రమ రవాణాకు పాల్పడ్డారని సూచిం చడానికి ఎటువంటి ఆధారాలు లేవని డిఫెన్స్ న్యాయవాది వాదించారు.జూలై 25న ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్‌లో కేరళకు చెందిన నన్స్‌ను అరెస్టు చేశారు. అయితే, ఈ అరెస్ట్ ను కేరళలోని, అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రెండూ ఖండించాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బిజెపి ప్రభుత్వం మత స్వేచ్ఛను దెబ్బతీస్తోందని ఆరోపించాయి. ఈ అరెస్టును అన్యాయమని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఖండించారు. సదరు నన్స్ కొంతమంది గిరిజన బాలికలకు ఉపాధి కల్పించేందుకు కేరళకు తీసుకెళ్తు న్నారని ఆయన చెప్పారు. దీనిని చూసిన బజరంగ్ దళ్ సభ్యులు అపోహ పడి పోలీసులకు ఫిర్యాదు చేశారని థరూర్ అన్నారు. ఇది సరైందికాదన్న శశిథరూర్.. ఎవరూ దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేయనప్పుడు, వారిని వారం రోజులుగా జైలులో ఉంచారన్నారు. వారికి బెయిల్ ఇప్పిం చడానికి తాము ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తామని అటు, బిజెపి కేరళ యూనిట్ కూడా చెబుతోందని థరూర్ గుర్తు చేశారు.

# ఓటర్ల జాబితాలో నా పేరు లేదు

**ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి పారదర్శకత లేకుండా నిర్వహించిందని తేజస్వి యాదవ్ ఆరోపించారు. రాజకీయ పార్టీలను లూప్ నుంచి దూరంగా ఉంచి, పేద, అట్టడుగు ఓటర్లను టార్గెట్ చేసుకుని సామూహికంగా తొలగించిందన్నారు.**



**పాట్నా:** రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ శనివారంనాడు రాజకీయ వివాదానికి తెరలేపారు. కొత్తగా విడుదల చేసిన బిహార్ ఓటర్ల జాబితా లో తన పేరు లేదని తెలిపారు. అయితే, ఎన్నికల కమిషన్ ఆ వెంటనే స్పందించింది. సీరియల్ నెంబర్ 416లో ఆయన పేరు ఉందని పేర్కొంది.తేజస్వి యాదవ్ లైవ్ కాన్ఫరెన్స్‌లో మట్లాడుతూ, ఓటర్ల జాబితాలో తన పేరు కూడా మాయమైందని అన్నారు. ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి పారద ర్శకత లేకుండా నిర్వహించిందని ఆరోపించారు. రాజకీయ పార్టీలను లూప్ నుంచి దూరంగా ఉంచి, పేద, అట్టడుగు ఓటర్లను టార్గెట్ చేసుకుని సామూహికంగా తొలగించిందన్నారు. ఇలాంటి రివిజన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన అడ్వయిజరీని కూడా ఈసీ పక్కనపెట్టేసిందని చెప్పారు. విపక్ష పార్టీల సూచనలను బేఖాతరు చేసిందని అన్నారు. 'ఓటర్ల పేర్లు తొలగించమని చెప్పారు. కానీ పేద ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నారు' అని ఈసీపై మండిపడ్డారు.తన పేరు కనిపించడం లేదన్న తేజస్వి యాదవ్ వాదనను ఈసీ కొట్టివేసింది. అధికారిక ముసాయిదా జాబితాను విడుదల చేస్తూ సీరియల్ నెబర్ 416లో ఆయన పేరుందని తెలిపింది. ప్రామాణిక విధానం అనుసరించి ఓటర్ల తొలగింపుపై సమగ్ర సమాచారం అన్ని పార్టీలకు అందిస్తున్నామని చెప్పింది. నిర్దిష్ట ప్రక్రియ ద్వారా ఓటర్ల రివిజన్ చేపట్టామని, అప్పీల్ చేసుకునేందుకు సెప్టెంబర్ 1వ తేదీ వరకూ అవకాశం కల్పించామని తెలిపింది.ఈసీ శుక్రవారంనాడు విడుదల చేసిన డాటా ప్రకారం, బీహార్ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో 6,564,075 పేర్లను ఈసీఐ తొలగించింది. రాష్ట్రంలో రిజిస్టర్డ్ ఓటర్ల సంఖ్య 7.89 కోట్ల నుంచి 7.24 కోట్లకు తగ్గింది. పాట్నాలో అత్యధికంగా ఓట్ల తొలగింపు జరుగగా, గయ, సీతామర్హి, అరారియా, పూర్ణయా, దర్భంగా, సివాన్, వైశాలి, బెగుసరాయి, జముయి జిల్లాల్లోనూ ఈ ప్రభావం కనిపించింది.ఎన్యూమరేషన్ ఫారంలు అందకపోవడంతో పేర్లు తొలగిం చినట్టు ఈసీఐ వివరణ ఇచ్చింది. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల నామినెటెడ్ అధికారులు ఈ దరఖాస్తులను డిస్ట్రిబ్యూట్ చేయగా, 65.64 లక్షల దరఖాస్తులు తిరిగి రాలేదు. దీంతో ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగించారు. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియపై విపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు కురిపించాయి. పార్లమెంటులో ఈ అంశంపై చర్చకు విపక్షాలు పట్టపట్టగా, ప్రీసీజర్ లిమిటేషన్స్‌ను ప్రభుత్వం ప్రస్తావిస్తోంది. ఎలక్షన్ కమిషన్ నిర్వహణా చర్యలపై పార్లమెంటులో చర్చించలేమని లోక్‌సభ స్పీకర్ బలరాం జాఖడ్ రూలింగ్ ఇచ్చినట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

# ఇక ప్రతి మున్సిపాలిటీలో స్పాంజ్ పార్కు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో భవిష్యత్ లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పురపాలక శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతి పట్టణ స్థానిక సంస్థ పరిధిలో భూగర్భ జలాలను సంరక్షించడం, వరదల నివారణ, చెరువుల సమీపంలో నీటిని వృథం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అందు కనుగుణంగా ప్రతి మున్సిపాలిటీలో తమిళనాడు తరహాలో స్పాంజిపార్కులను ఏర్పాటు చేయాలని పురపాలకశాఖ నిర్ణయించింది.స్పాంజ్ పార్కులు అంటే వర్షపు నీటిని పీల్చుకునేలా, ఆ నీటిని వడపోసేలా రూపొందించే పార్కులు. ఇవి వరదలను తగ్గించడానికి, భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడానికి సహాయపడతాయి. ఇవి వరద నియంత్రణ, నీటి కాలుష్య నియంత్రణ, పట్టణ ప్రాంతాలకు పర్యావరణ ప్రయోజ నాలను సమకూరుస్తాయి. జీవవైవిధ్యానికి పెంపొందించడానికి ఇవి ఎంతగానో ఉప యోగపడతాయని అధికారులు చెబుతున్నారు.తమిళనాడు తరహాలో స్పాంజ్ పార్కులను ఏర్పాటు చేయడానికి పురపాలకశాఖకు పలువురు మున్సిపల్ కమి షనర్లను అక్కడి విధానాలను అధ్యయనం చేశారు. ఒక్కో స్పాంజి పార్కు కోసం రూ.కో టికిపైగానే ఖర్చు చేసినట్టు గుర్తించారు. ప్రతి మున్సిపాలిటీల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థలాలను గుర్తించాలని పురపాల కశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.చెన్నైలోని పోరూరులో మొదటి వెట్ ల్యాండ్ స్పాంజ్ పార్క్ ను ఏర్పాటు చేశారు. న్యూయార్క్ నగరంలోని గోవానస్ కెనాల్ చుట్టూ స్పాంజ్ పార్క్ ప్రాజెక్టులు ఉన్నాయి. హోసూర్ లో కూడా ఒక స్పాంజ్ పార్క్ ఉంది. పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఈ పార్కులు ఉపయోగపడుతున్నాయి.

# సన్న బియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌దే

- **మంథనిలో 10,200 కొత్త రేషన్ కార్డుల పంపిణీ**
- **సన్న బియ్యం సరఫరాకు నాంది**
- **మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ద్వారా 200 కోట్ల టికెట్లు**
- **అప్పుల భారం మధ్యా సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం**
- **ప్రతీ నెల 6 వేల కోట్లు వడ్డీ చెల్లింపులు**
- **మినీ ఇండస్ట్రియల్ పార్క్, 3,500 ఇళ్లు మంజూరు**
- **మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యం : శ్రీధర్ బాబు**

**మంథని ,ఫ్లాష్ ఇండియా :** మంథని నియోజ కవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.“రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్న బియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నాం,” అని అన్నారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకు న్నామని స్పష్టం చేశారు.మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. “ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారు,” అని తెలిపారు.అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు.మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు.“కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం,” అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# 15 సీట్లతో మోడీ ప్రధాని అయ్యారు..



- **2014 నుంచి జరుగుతున్న ఎన్నికలపై అనుమానాలున్నాయి..**
- **15 సీట్లతో మోడీ ప్రధాని అయ్యారు..**
- **భారతదేశంలో ఈసీకి ఉనికి లేదు: రాహుల్ గాంధీ**
- **దేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది..**
- **ఈసీ ఇచ్చిన వివరాలతో పోలిస్తే మోసం బయటపడింది..**
- **ఈసీ మాకు ఒరిజినల్ ఓటర్ లిస్ట్ ఇవ్వలేక పోయింది: రాహుల్ గాంధీ**
- **కాంగ్రెస్ న్యాయ సదస్సులో ఈసీపై రాహుల్ గాంధీ ఫైర్..**
- **లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ చీటింగ్ చేసింది..**
- **మా దగ్గర పక్కా ఆధారాలున్నాయి: రాహుల్ గాంధీ**

**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో ఇవాళ జరుగుతున్న కాంగ్రెస్ న్యాయ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 2014 నుంచి జరుగుతున్న ఎన్నికలపై అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఒకే పార్టీ అన్ని స్థానాలు గెలుచుకోవడం ఏంటి.. అయితే, కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ఒక్క సీటు కూడా రాకపోవడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. కేవలం, బీజేపీకి గంపగుత్తగా ఓట్లు పడటంపై మేము దృష్టి పెట్టాం.. ఆధారాల కోసం 6 నెలలు పని చేశాం.. ఎన్నికల కమిషన్ మాకు ఒరిజినల్ ఓటర్ లిస్ట్ ఇవ్వలేకపోయిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.అయితే, ఈసీ ఇచ్చిన ఓటర్ లిస్టును స్కాన్ చేయలేం. కాపీ చేయలేమని లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభ ఎన్నికలు చోరీకి గురయ్యాయి.. గత దఫాలుగా లోక్ సభ ఎన్నికలు రిగ్ అయ్యాయని ఆరోపించారు. ప్రతీ 6.5 లక్షల మంది ఓటర్లలో లక్షన్నర ఓట్లు ఫేక్ అని తేలింది.. ఈసీ ఇచ్చిన వివరాలతో పోలిస్తే మోసం బయటపడింది అన్నారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, 15 సీట్లతో మోడీ ప్రధాని అయ్యారు.. ఆ 15 సీట్లు లేకుంటే ప్రధాని పదవి మోడీకి దక్కేది కాదన్నారు. రాబోయే రోజుల్లో ఇవన్నీ బయట పెడుతాం..మా దగ్గర 100 శాతం ఆధారా లున్నాయి.. రఫేల్ డీల్ లో పీఎంవోతో పాటు NSA జోక్యం చేసుకున్నాయి.. దీనికి సంబంధించి మా దగ్గర డాక్యుమెంట్స్ ఉన్నాయని రాహుల్ గాంధీ తెలియజేశారు.

**దేశంలో ఎన్నికల వ్యవస్థ చచ్చిపోయింది..**

దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో ఇవాళ జరుగుతున్న కాంగ్రెస్ న్యాయ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నేను రాజును కాదు, రాజా కావాలని కోరుకోను.. రాజు కాన్సెప్ట్ కు నేను వ్యతిరేకం అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రారంభించింది న్యాయవాదులే.. స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకం.. న్యాయవాదులు కాంగ్రెస్ కు వెన్నుముక గా ఉన్నారు.. మీరు చేసిన త్యాగాలను ఇపుడు విధ్వంసం చేశారు.. ఎన్నికల విధానాన్ని పరిశీలిస్తే ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి.. బీజేపీ వరుస విజయాల వెనుక చీటింగ్ జరుగుతోంది.. ఇపుడు మన వద్ద ఆధారాలు ఉన్నాయి.. మహారాష్ట్ర లోక్ సభ ఎన్నికల్లో మేం గెలిచాం.. అసెంబ్లీలో మేం ఓడాం.. ఎన్నికల కమిషన్ కాపీలు స్కాన్ ప్రొటెక్ట్ తో రూపొందించారు.. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు.ఇక, భారత్ లో ఎన్నికల కమిషన్ నిజంగా చచ్చిపోయిందని రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికల్లో పీఎం ఇన్ని సీట్లు గెలవలేరు.. మా దగ్గర ఆధారాలు ఉన్నాయి.. కాబట్టే ఇపుడు మాట్లాడుతున్నాం.. ఎలా పోరాడాలో మాకు తెలుసు.. రాజకీయ నాయకులుగా మా పోరాటం చేస్తున్నాం.. న్యాయవాదులు కోర్టుల్లో పోరాడాలని సూచించారు. పీఎం ఆఫీస్ రఫేల్ బీ విషయంలో ఇచ్చిన డాక్యుమెంట్ స్పష్టంగా ఉంది.. ఏ దేశంలో ఇలా జరగదు.. నాపై కేసులు పెట్టారు, 30 కేసుల్లో పోరాడు తున్నాను.. రైతుల కోసం పోరాడితే.. నన్ను బెదిరించారు అని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎవరికి భయపడదు.. దేశం మా రక్తం.. రాజ్యాంగంపై అన్ని రకాలుగా దాడి చేస్తున్నారు.. రాజ్యాంగం పరిధిలోకి దేశంలోని అన్ని వర్గాలు వస్తాయి.. చరిత్రపై, చట్టాలపై, రాజ్యాంగంపై దాడి చేయడం దారుణమన్నారు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.అయితే, నా కుటుంబం దేశం కోసం ప్రాణ త్యాగం చేసింది.. నేను ఎవరికి భయపడను అని రాహుల్ గాంధీ తెల్చి చెప్పారు. అగ్గికి భయపడి పోరాటం ఆపలేను.. ఎన్నటికైనా కాలి పోవాల్సిందే.. కాంగ్రెస్ శాంతి యుతంగా పోరాడుతుంది.. రాజకీయంగా మేం ఎలాగైనా పోరాడుతామన్నారు. కోర్టుల్లో న్యాయం కోసం పోరాడాల్సింది న్యాయవాదులు.. దేశంలో ఇపుడు లీగల్ సర్వీస్ అవసరం పడుతుంది.. దేశంలో ఎందరో కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయవాదుల అవసరం ఉంది.. లీగల్ ఎయిడ్ అందరికీ అందించాలని పేర్కొన్నారు.

# ట్రంప్ కు ప్రధాని మోడీ భయపడుతున్నాడు..

- **అమెరికా అధ్యక్షుడు టెర్రరిజాన్ని వ్యతిరే కించారు, కానీ పాకిస్తాన్‌ను తప్పుబ ట్టలేదు..**
- **ఇండియా- పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను అని డొనాల్డ్ ట్రంప్ పదే పదే అంటున్నాడు..**
- **మన ప్రధాన మంత్రి మోడీ నోరు తెరవడు.. ఎందుకంత భయం: సీపీఐ నారాయణ**

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఫీజులు కట్టలేదని కొన్ని విద్యా సంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో స్టూడెంట్స్ ఇబ్బందులు పడుతున్నారు అని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను.. అనేక ఆడంబరాలకు ఖర్చు పెడుతున్నారు.. విద్యార్థులకు చెల్లించాల్సినవి మీకు ఎక్కువయ్యాయా అని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇద్దరు సీఎంలు కూడా స్టూడెంట్స్ విషయంలో అసలు నిర్లక్ష్యం వహించకూడ దన్నారు. ఇక, కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రభుత్వం చేతిలోకి వచ్చింది.. ముగ్గురు సభ్యుల కమిటీ వేసింది తెలంగాణ ప్రభుత్వం.. వీరి నివేదికను పూర్తిగా స్టడీ చేసి.. సలహాలు ఇస్తారు.. అబద్ధాలను చాలా అందంగా చెప్పగలిగే నైపుణ్యం దేశంలో ఇద్దరికీ చాలా బాగా తెలుసు... అది ఒకటి మోడీ, రెండు కేసీఆర్.. కాళేశ్వరం ప్రాజెక్టునీ అతను ఇష్టాను సారంగా నిర్మాణం చేయించాడు అని నారాయణ విమర్శించారు.ఇక, కర్ణాటకలోని పవిత్ర దేవాలయంగా భావించే ధర్మశాలలో అసలు ఏం జరుగుతుంది? అని సీపీఐ నారాయణ ప్రశ్నించారు. దాదాపుగా 400 మందిని అక్కడ చంపి పాతేశారు.. ఇప్పుడు ఎముకలు బయట పడుతున్నాయి.. యాడ్యూరప్ప ప్రభుత్వం ఉన్నప్పుడు పట్టించు కోలేదు.. కాంగ్రెస్ సర్కార్ ఉంది కాబట్టి కనీసం సిట్ వేసి విచారణ చేస్తున్నారు.. కర్ణాటక హైకోర్టు తీర్పునీ స్వాగతిస్తున్నా మన్నారు. ఇక, బీజేపీ వాళ్ళు ఆత్మన్యూనతా భావనలోకి వెళ్ళిపోతున్నారు.. బ్లాక్ స్పాట్ విధానం అమలు చేస్తున్నారు.. ధర్మశాలనీ దేవాదాయ శా కి హ్యాండ్ ఓవర్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం అక్కడ జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ట్రస్టీని అరెస్ట్ చెయ్యాలని కోరారు. తాజాగా, కాశ్మీర్ లో పర్యటించాను.. పహల్గాం వెళ్ళాలి అనుకున్నాము.. కానీ ఆర్మీ వాళ్లు ఆంక్షలు పెట్టడంతో వెళ్ళలేకపోయాం.. పహల్గాం దాడిలో ఉన్న టెర్రరిస్టులను ఒక్కరిని కూడా మోడీ ప్రభుత్వం చంపలేదు.. మొన్న పార్లమెంట్ ప్రారంభానికి ముందు రోజు ఒక ఉగ్రవాదిని చంపారు.. ఇన్నాళ్లుగా వాళ్లు దొరకలేదా అని కేంద్రాన్ని అడిగారు. వాళ్ళు నిజంగా టెర్రరిస్టులేనా కాదా అనేది మరొక అంశం అని నారాయణ చెప్పుకొచ్చారు.అయితే, అమెరికా అధ్యక్షుడు టెర్రరిజాన్ని వ్యతిరేకించారు.. కానీ పాకిస్తాన్ ను తప్పుబట్టలేదు అని నారాయణ పేర్కొన్నారు. ట్రంప్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నా.. భారత ప్రధాని ఒక్కమాట మాట్లాడడం లేదు.. ట్రంప్ నేనే ఆపాను యుద్ధాన్ని అంటాడు.. మన ప్రధాని నోరు తెరవడు.. ఎందుకంత భయం.. బానిస లాగా ఎందుకు భావించడం అని అడిగారు. మోడీ తన విధానాలను మార్చుకోవడం లేదు.. దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే త్రిపురలో ప్రారంబించారు.. ఏపీలో కూడా అమలుకు సిద్ధమయ్యారు.. త్రిపురలో రైతులతో మాట్లాడితే.. గతంలో నెలకు 150 రూపాయల బిల్లు వచ్చేదని.. ఇప్పుడు 80 వేలు వస్తుందని చెబుతున్నారు.. స్మార్ట్ మీటర్ కాదు అది విష్ణు చక్రం.. అంత స్పీడ్ గా తిరుగుతోంది.. బిల్లులు కూడా అలాగే వస్తున్నాయని ఆరోపించారు. త్వరలో మా పార్టీ జాతీయ మహాసభలు జరగ బోతున్నాయి.. ఇండియా కూటమిలో కూడా లోపాలు ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు.

# దమ్ముంటే ఆ అణుబాంబు పేల్చు..

- **రాహుల్ గాంధీ “ఓటు చోరీ అణుబాంబు” వ్యాఖ్యలు..**
- **కాంగ్రెస్ నేత వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్..**
- **దమ్ముంటే ఆ అణుబాంబు పేల్చాలని సవాల్..**



**ఢిల్లీ :**ఎన్నికల కమిషన్ కు వ్యతిరేకంగా “ఓట్ల దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాల అణుబాంబు” తన వద్ద ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల సంచనల వ్యాఖ్యలు చేశారు. అయితే, ఆయన వ్యాఖ్యల్ని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శనివారం తీవ్రంగా విమర్శించారు. ఆ అణుబాంబును పేల్చాలని సవాల్ విసిరారు. “రాహుల్ గాంధీ తన వద్ద అణు బాంబు ఉందని చెబుతున్నారు. అలా అయితే, అతను దానిని వెంటనే పేల్చాలి. అతను తనకు హాని జరగకుండా చూసుకోవాలి” అని ఎద్దేవా చేశారు.బీజేపీకి ఎన్నికల కమిషన్ “ఓటు దొంగతనం” చేసిందని నిరూపించడానికి తన పార్టీ వద్ద “అణుబాంబు” ఆధారాలు ఉన్నాయని రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. దీనిని ఎన్నికల కమిషన్ తీవ్రంగా ఖండించింది. నిరాధారమై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికింది. భారత ఎన్నికల కమిషన్ ప్రశ్నించలేని సమగ్రతకు పేరుగాంచిన సంస్థ అని రాజ్ నాథ్ సింగ్ అన్నారు.బీహార్ లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోందని, రాజ్యాంగ సంస్థ గురించి పనికిమాలిన ప్రకటనలు చేయడం ప్రతిపక్ష నేతకు తగదని రాజ్ నాథ్ అన్నారు. ఆయన సొంత పార్టీ చేతులకే రక్తం ఉందని, 1975లో ఎమర్జెన్సీ విధించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి ప్రయత్నించిందని అన్నారు. బీహార్ లో గత 20 ఏళ్ల పాలనలో నితీష్ కుమార్ అభివృద్ధి చేశారని రాజ్ నాథ్ సింగ్ ప్రశంసించారు.

# జర్నలిస్టులకు క్యూఆర్ కోడ్‌తో ప్రెస్ స్టిక్కర్లు




**ఆంధ్రప్రదేశ్ :** తిరుపతి పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల అభ్యర్థన మేరకు, తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలపై, క్యూఆర్ కోడ్ కలిగిన ప్రత్యేక ప్రెస్ స్టిక్కర్లు మీడియా ప్రతినిధులకు అందజేశారు. ఈ స్టిక్కర్లను స్కాన్ చేస్తే, పాత్రికేయుల పేరు, వారు పనిచేస్తున్న మీడియా సంస్థ పేరు, డిజిగ్నేషన్, కలెక్టర్ ఇచ్చిన గుర్తింపు (అక్రిడేషన్) నంబర్ వంటి వివరాలు కనిపి స్తాయని అధికారులు తెలిపారు. ఈ ఏర్పాటుతో నకిలీగా ప్రెస్ అంటూ తిరుగుతున్నవారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు. ప్రెస్ స్టిక్కర్లు పోలీసుల అనుమతి లేకుండా ఎవరైనా తయారు చేస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ, నిజమైన విలేకరుల హక్కులను కాపాడేలా జిల్లా ఎస్పీ చేసిన ఈ చర్య అభినందనీయమన్నారు.

# ఆపరేషన్ సింధూర్ విజయానికి అంకితం

- దేశభక్తికి ప్రతీకగా నిలిచే సిరిసిల్ల బంగారు శాలువా..
- త్రివిధ దళాల వీరత్వాన్ని బంగారు శాలువాలో నేసిన నల్ల విజయ్..
- చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీకి బహుమతిగా ఇవ్వనున్న నల్ల విజయ్




**రాజన్న సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ తన ప్రత్యేక నైపుణ్యంతో మరోసారి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించాడు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా త్రివిధ దళాల (సైన్యం, నౌకాదళం, వాయుసేన) చిత్రాలను బంగారు శాలువాపై నేసి తన దేశభక్తిని చాటుకున్నాడు. ఆగస్టు 7వ తేదీన చేనేత దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక శాలువాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పంపుతానని అతడు ప్రకటించాడు. దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న జవాన్లకు ఈ శాలువా అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు.అయితే, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని యావత్ దేశం మొత్తం ఖండించిందని చేనేత కళాకారుడు నల్ల విజయ్ తెలిపారు. భారత సైన్యం తన సత్తా చాటిందని గర్వంగా తెలిపారు. తాను నేసిన ఈ బంగారు శాలువా భారత సైనికుల వీరత్వానికి, దేశ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇక, 24 క్యారెట్ల బంగారంతో తయారు చేసిన శాలువాను అగ్గిపెట్టెలో సరిపోయేలా నేశాడు.. ఈ శాలువా రెండు మీటర్ల పొడవు, 38 అంగుళాల వెడల్పును కలిగి ఉంది.. దీనిపై ఆపరేషన్ సింధూర్ అనే పేరుతో ప్రతీకాత్మక నివాళి అని రాసుకొచ్చాడు. తన చేతి పనుల నైపుణ్యాన్ని మరోసారి నల్ల విజయ్ కుమార్ ఈ శాలువాపై ప్రదర్శించారు.

# ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కృష్ణ నది జన్మస్థానంతో పాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. వరదలు పోటెత్తుతున్నాయి. దీంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జూలై నెలలోనే కృష్ణ నదిపై ఉన్న జూరాల, శ్రీశైలం, సాగర్, టైల్ పాండ్, పులిచింతల, కృష్ణ బ్యారేజీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా జూరాల, శ్రీశైలం జలాశయానికి గత నెల రోజులుగా భారీ వరద వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా.. ఈ రోజు కూడా జలాశయానికి ఎగువ నుంచి భారీ వరద కొనసాగుతుంది. దీంతో డ్యామ్ అధికారులు అప్రమత్తమై 8 గేట్లను 10 అడుగులు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి 2,70,640 క్యూసెక్కుల వరద వస్తుంది.8 గేట్లు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 2,76,461 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దింతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ కు వరద కొనసాగుతుంది. ఇన్ ఫ్లో 2 లక్షల 38 వేల 629 క్యూసెక్కులు వరద నీరు వస్తుండగా..24 క్రస్ట్ గేట్లు 5 ఫీట్ల మేర, 2 క్రస్ట్ గేట్లు 10 ఫీట్లు పైకి ఎత్తి దిగువకు 2 లక్షల 56 వేల 417 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే సాగర్ దిగువ ఉన్న టైల్ పాండ్, పులిచింత ప్రాజెక్టులు ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో.. గేట్లను ఎత్తి పెట్టిన అధికారులు.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో విజయవాడలోని కృష్ణా బ్యారేజీకి వరద పెరగడంతో అప్రమత్తం అయిన అధికారులు సగానికి పైగా గేట్లను ఎత్తి పెట్టారు. దీంతో పై నుంచి వచ్చిన వరద వచ్చినట్లే సముద్రంలో కి వెళ్తుంది.

# లగ్జరీ కార్లలో దిగిపోతారు..

- సికింద్రాబాద్ ఏరియాలో ఆవుల దొంగలు..
- ఖరీదైన కార్లలో వచ్చి కార్ల దొంగతనం..
- ఆవులకు మత్తుమందు ఇచ్చి ఎత్తుకెళ్తున్న దొంగలు..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఖరీదైన కార్లలో వస్తారు.. అక్కడే గంటల తరబడి తిష్ట వేస్తారు.. కబుర్లు చెప్పుకొని వెళ్లిపోతున్నారేమో..? లేదా మందు ఏమైనా తాగుతున్నారా? ఓ దమ్ము లాగించి వెళ్తున్నారేమో.. అనుకుంటే పొరపాటే.. ఎందుకుంటే.. ఇంతకీ వాళ్లు ఏం చేస్తున్నారంటూ ఫోకస్ పెట్టిన పోలీసులు.. అసలు విషయం చూసి షాక్ తిన్నారు... సికింద్రాబాద్ లో సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఆ దృశ్యాలను చూసి పోలీసులు షాక్ తిన్నారు.. ఖరీదైన కార్లలో కొందరు యువకుల వచ్చారు.. గంట పాటు అక్కడే ఉండి వెళ్లిపోయరు. వారేవరో అర్థం కాక సీసీ కెమెరాలు గమనిస్తే అసలు విషయం తెలిసి అంతా షాక్ అయ్యారు.. సికింద్రాబాద్ బండిమేట్ ప్రాంతంలో కొందరు యువకులు రాత్రి సమయల్లో ఖరీదైన కారులో వచ్చారు. కొంత సమయనికి అక్కడ కొన్ని ఆవులు స్పృహ లేకుండా పడిపోయి ఉండగా.. మరి కొన్ని ఆవులు కనిపించలేదు.. దీంతో, వెంటనే సీసీ టీవీ ఫుటేజ్ ను స్థానికులు పరిశీలించగా.. కొందరు యువకులు ఆ ఖరీదైన కారులో ఆవులను బలవంతంగా తీసుకెళ్లినట్టు కనిపించింది.. ఈ మధ్య కాలంలో వరుసగా ఆవులు మాయం అవుతుండడంతో ఎటు వెళ్లి పోయయని భావించిన స్థానికులు.. ఇప్పుడు సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలు చూసి షాక్ అయ్యారు. వెంటనే ఆ యువకులపై చర్యలు తీసుకోవలంటూ మోండా మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు..కాగా, హైదరాబాద్ , సికింద్రాబాద్ లో చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే గోవులు తిరుగుతూ ఉంటాయి.. కొన్ని సాయంత్రానికి గోశాలకు వెళ్లిపోతే.. మరికొన్ని ఆయా కూడళ్లలోనే ఉండిపోతాయి.. ఇప్పుడు రోడ్లపై ఉన్న గోవులను ఆ యువకులు టార్గెట్ చేసినట్టుగా తెలుస్తుంది.. గోవులను తరలించడం అంతా ఈజీ కాదు.. అందుకే.. డౌట్ రాకుండా.. వాటికి మత్తు మంది ఇచ్చి.. సైలెంట్ గా వాటిని కారులో తరలించిన ఘటన ఇప్పుడు కలకలం రేపుతోంది..

# పగలు రెక్కీ..రాత్రి చోరీలు..!

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** పగలు రెక్కీ నిర్వహిస్తూ రాత్రి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శనివారం ముఠాకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గత నెల 25న భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామ శివారులో గల రెడిమిక్స్ కంపెనీలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు వాచ్ మెన్ లను బెదిరించి మొబైల్, 11 వేల విలువ చేసే ఐరన్ రాడ్లను అపహరించారు. అలాగే 27న రాజంపేట మండలం తలమడ్ల శివారులో గల జెన్ అడ్సోర్పిటేషన్ కంపెనీలో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 15 లక్షల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లారు.ఈ రెండు కేసులలో పోలీసులు బృందాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించారు. భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద ఒకరు, కామారెడ్డిలో నలుగురు, హైదరాబాద్ లో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో దొంగిలించిన సొత్తును హైదరాబాద్ ముషీర్ బాగ్ లో విక్రయిస్తారని తేలింది. గతంలో వీరిపై ఆరు కేసులు ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తానే అలీ, బిర్దేష్ అలీ, సల్మాన్, మహమ్మద్ సమీర్, చాంద్ బాబు(మైనర్) లు ముఠాగా ఏర్పడి కామారెడ్డి పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీ, ఆదర్శ నగర్ కాలనీల్లో నివాసం ఉంటున్నారు. వీరు చోరీ చేసిన వస్తువులను ముషీరాభాగ్ చేర్చడాని ఆ ప్రాంతానికి చెందిన హాసన్ ఖాన్ అనే వ్యక్తి వాహనాన్ని సమకూరుస్తాడు.ఆ వాహనంలో ముషీరాభాగ్ తీసుకెళ్లిన వస్తువులను పది నిమిషాల్లో పార్టులుగా విడదీసి కంటికి కనిపించకుండా ఇతర చోటకు తరలిస్తారని ఎస్పీ తెలిపారు. వీరిపై మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో మరొక నాలుగు కేసులు ఉన్నాయని, వీరి వద్ద నుంచి మొబైల్ ఫోన్, 1 అట్ఫీ కండెన్సర్, 1 ఎస్ పీ డీ యు, 20 లీటర్ల ట్యాంకులు 3, రెండు రాడ్లు, ఒక బెల్ట్ గార్డ్, ఒక ఎఫ్ ఎఫ్ ఈ, ఒక తర్మసిఫాన్ పాట్, ఒక పైప్ లైన్ (వీటి విలువ 15 లక్షలు), 390 మీటర్ల సోలార్ ప్లాంట్ కాపర్ వైరు, 15 వేల విలువ చేసే సెంట్రింగ్ బాక్సులు, 2.25, 7.5, 2 హెచ్. పి మోటార్లు, ఒక బైకు, దొంగతనం చేయడానికి ఉపయోగించిన బైకు, 3 మొబైల్స్, ఐరన్ రాడ్డు, టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్పీ చైతన్య రెడ్డి, సిసిఎస్ పోలీసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో
# భారీగా పెరిగిన అడ్మిషన్స్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జులై 31 నాటికే 10 వేలకు పైగా అడ్మిషన్లు జరిగాయని ఇంటర్ బోర్డు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 83,844 అడ్మిషన్లు నమోదు కాగా, ఈ సంవత్సరం 2025-26 జూలై 31 నాటికే ఈ సంఖ్య 94,155కు చేరింది. లెక్చరర్ల నుంచి డీఐఈవోల వరకు చేసిన కృషి, సమన్వయంతోనే అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో లక్ష అడ్మిషన్లు టార్గెట్ గా పెట్టుకున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల పెరుగుదలకు కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ, కొత్త లెక్చరర్ల నియామకాలు కీలక పాత్ర పోషించాయని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ కాలేజీలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందని ఆఫీసర్లు అభిప్రాయపడుతున్నారు. లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లు గ్రామాల్లో తిరిగి 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి రీజన్స్ సైతం విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కారణమయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వ కాలేజీల్లో మౌలిక వసతుల కల్పన, మెయింటెనెన్స్ కోసం రూ.2.50 లక్షలు, గేమ్స్ కిట్ కోసం ప్రతి కాలేజీకి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుంది. స్టూడెంట్స్ కు ప్రతి సంవత్సరం ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నారు. లెక్చరర్ల బోధన, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు ప్రతి కాలేజీలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఫిజిక్స్ వాలా ఫౌండేషన్ ద్వారా ఆన్ లైన్ కోర్సులు అందించడం వంటి కారణాలతో విద్యార్థుల్లో ప్రభుత్వ కాలేజీల్లో చేరాలనే ఆసక్తి పెరిగినట్లు తెలుస్తున్నది.మా కాలేజీలో గతేడాది 146 అడ్మిషన్లు ఉండగా.. ఆ సంఖ్య ఇప్పుడు 295 కు చేరింది. లెక్చరర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి పోస్టర్లు, పాంప్లెంట్స్ తో ప్రచారం చేశాం. 10వ తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ కాలేజీలో ఉన్న సౌకర్యాలు, ఇక్కడ చదివితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో వివరించాం. ఆన్ లైన్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం ఈ సారి అడ్మిషన్లు పెరిగేందుకు కారణంగా చెప్పొచ్చు. ఆన్ లైన్ కోచింగ్ తరగతులు నిర్వహించడం విద్యార్థులకు సదవకాశంగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. - రజిత, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, జోగిపేట్.

# రాజకీయ లబ్ధి కోసం తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టొద్దు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలపడుతుందని గమనించిన బిఆర్ఎస్ పార్టీ స్వార్థ రాజకీయ లబ్ధి కోసం తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలవాలని చూస్తుందని మిర్యాలగూడ తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ ఆరోపించారు. ఆయన మిర్యాలగూడలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన దశాబ్ద కాలం దాటిన తర్వాత బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని ప్రస్తావిస్తూ తెలుగు ప్రజల మధ్య చిచ్చులు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్ నాయకులు ఆ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయం ఏమిటో ప్రజాక్షేత్రంలో నిరూపించాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ప్రాజెక్టు అంశాన్ని అనుకూలంగా జగన్మోహన్ రెడ్డికి సానుకూలంగా ప్రవర్తించినప్పుడు ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. తెలుగు ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజనరీ పరిపాలనను తెలంగాణలో మెచ్చుకుంటున్న తరుణంలో, ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలపడుతుంది అన్న భయంతో బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ సెంటిమెంట్తో మరోసారి ప్రజలను రెచ్చగొట్టాలని చేస్తున్నారన్నారు.నిజంగా బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ప్రజల ముందు నిరూపిస్తే తెలంగాణ తెలుగుదేశం పార్టీ ప్రాజెక్టుకు ప్రత్యేకంగా పోరాడుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ బలపడితే బిఆర్ఎస్ పార్టీ కనుమరుగుతుంది అనే భయంతో తెలంగాణ ప్రజలను రెచ్చగొడితే రాష్ట్రంలోని తెలుగుదేశం అభిమానులు, కార్యకర్తలు తిరగబడితే ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతి మరొక్కసారి పునరావృతం అవుతుంది అని హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌ను ఏకిపారేసిన ఈటల..

- బీఆర్ఎస్‌కి ఓబీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు
- రిజర్వేషన్ల పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారు
- మోసం చేసింది కాంగ్రెస్ అని ప్రజలు డిసైడ్ అయ్యారు
- రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని కోర్టులు చెబుతున్నాయి
- బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే ముఖ్యమంత్రి భరతం పడతాం : ఈటల




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో అనేక అంశాలు ఉన్నాయని, స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో బీసీలకు 42 శాతం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ హాయంలో బీసీ శాతం 23 కు పడిపోయిందని ఆయన మండిపడ్డారు. బీసీల కళ్లలో మట్టి కొట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీఅని, బీఆర్ఎస్ పార్టీకి ఓబీసీ ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన ఏకిపారేసారు. రేవంత్ రెడ్డి ఓటమిని అంగీకరించారని, డిక్లరేషన్ ల పేరిట అనేక హామీలిచ్చారన్నారు. రేవంత్ రెడ్డిని అర్థం చేసుకోలేకపోయామనీ, మోస పోయామని ప్రజలు అనుకుంటున్నారని ఈటల అన్నారు. రిజర్వేషన్ల పేరుతో రేవంత్ రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని, 20 నెలలు దాటిపోయింది రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేకపోతున్నారన్నారు.అంతేకాకుండా..' మోసం చేసిన కాంగ్రెస్ అని ప్రజలు డిసైడ్ అయ్యారు. ఫీ రియాంబర్స్ మెంట్ లేక పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పాత పద్ధతుల్లో ఫీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం, లేకపోతే సీఎం నీ భరతం పడతామని హెచ్చరికలు ఇస్తున్నాం. ఎన్ని హామీలున్నాయో గుర్తుందా రేవంత్ రెడ్డి..?. బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేసిన రేవంత్ రెడ్డి, ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ కు చట్ట బద్ధత ఉంటదా..?. రిజర్వేషన్లపై మొట్టమొదటి కమీషన్ వేసిన రాష్ట్రం తమిళనాడు. చట్ట బద్దంగా 9th సెడ్యూల్ ల్లో చేర్చుకొని రిజర్వేషన్లను సాధించుకున్న తొలి రాష్ట్రం తమిళనాడు.ఢిల్లీకి వెళ్ళి రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు, బీజేపీపై నెపం వేసే కుట్రలు చేస్తున్నారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని కోర్టులు చెబుతున్నాయి. ఆర్టికల్ 340, కమిషన్ ఎంక్వారి 1942 ప్రకారం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్ళాలి. బీసీలను మోసం చేసే కుట్రలు రేవంత్ రెడ్డి మానుకోవాలి. రేవంత్ కు ఆత్మశుద్ధి ఉంటే మంత్రి వర్గంలో బీసీలకు ఏం ఇచ్చారు..? ఏం శాఖలు ఇచ్చారో చెప్పాలి. బీ ఆర్ ఎస్ ఉన్నంత కాలం బీసీ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ ఉన్నంత కాలం బీసీ అధ్యక్షుడు కయ్యే పరిస్థితి లేదు. కాంగ్రెస్ హయాంలో బీసీ ముఖ్యమంత్రిని చేయలేదు, భవిష్యత్ లో కూడా చేస్తారనే నమ్మకం లేదు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే ముఖ్యమంత్రి నీ భరతం పడతాం.' అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# భద్రాద్రి జిల్లాకు సంపూర్ణత అభియాన్ అవార్డు



**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అభివృద్ధి సూచిక లన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్ లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి ఆయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్ లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం ను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ...ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచింది అని అన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయి అని, ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చు అన్నారు.భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు.

# వరకట్న వేధింపులకు బలైన వివాహిత



**మానకొండూరు ,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం, గంగ్గిపల్లి గ్రామంలో చలిగంటి హేమలత (23) అనే వివాహిత అదనపు కట్నం కోసం అత్తింటివారు పెట్టిన వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. గురువారం సాయంత్రం తన ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. హేమలత తల్లి కొయ్యేడ సమ్మక్క ఫిర్యాదు మేరకు పోలీసులు హేమలత భర్త చలిగంటి నాగయ్య, అత్త పోచమ్మ, ఆడబిడ్డలు రుద్రరపు స్వరూప, ఎల్కపల్లి కొమురమ్మల పై కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేశపట్నం మండలం, మెట్పల్లి గ్రామానికి చెందిన హేమలతకు 19/3/2020 న మానకొండూరు మండలం, గంగ్గిపల్లి గ్రామానికి చెందిన చలిగంటి నాగయ్యతో వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం అత్తింటివారు ఆమెను వేధించడం మొదలు పెట్టారు. హేమలత తల్లిదండ్రులు ఆమెను గర్భం దాల్చినప్పుడు పుట్టింటికి తీసుకు వెళ్లారు. కొడుకు పుట్టాక, ఐదు నెలల తర్వాత తిరిగి అత్తగారింటికి పంపించారు. గురువారం సాయంత్రం సుమారు ఐదు గంటలకు హేమలత చనిపోయినట్లు బంధువుల ద్వారా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మానకొండూరు సీఐ సంజీవ్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ కేసులు, కొట్లాటలు నాకు కొత్త కాదు..

- కేటీఆర్ పరువునష్టం కేసులో నాంపల్లి కోర్టు కాగ్నిజెన్స్
- "నా జీవితమే ఒక పోరాటం".. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు
- మీడియా రిపోర్టులపై 'సంచలనం', 'బిగ్ బ్రేకింగ్' వ్యాఖ్యలకు స్పందన
- "చట్టం తన పని తాను చేసుకుంటుంది".. కోర్టు ఆదేశాలపై సురేఖ విశ్వాసం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేసిన పరువునష్టం దావా కేసులో నాంపల్లి కోర్టు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు."నా కేసుకు సంబంధించి గౌరవ కోర్టు కాగ్నిజెన్స్ తీసుకొని ముందుకు వెళ్ళాల ని స్ప ష్టం చేసింది." "నాకు ఈ దేశ న్యాయవ్యవస్థ మీద అపారమైన గౌరవం ఉంది. ఈ కేసులు, కొట్లాటలు నాకు కొత్త కాదు. నా జీవితమే ఒక పోరాటం." అని ఆమె అన్నారు.అంతేకాకుండా.. కొండా సురేఖ మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై కూడా స్పందించారు. "ఏ కేసులో అయినా గౌరవ కోర్టు కాగ్నిజెన్స్ తీసుకోవాలని చెప్పడం సర్వ సాధారణం. ఇది జరిగి రెండు రోజులు అయింది. అయితే కొంతమంది పాత్రికేయ మిత్రులు, జర్నలిస్టు సోదరులు 'కొండా సురేఖ కేసులో సంచలనం', 'బిగ్ బ్రేకింగ్' అంటూ వార్తలు రాస్తున్నారు. వారి ఉత్సాహం చూసి నాకు సంభ్రమాశ్చర్యం కలుగుతోంది.""కొండా సురేఖ పేరు అనగానే అంతటి ఉత్సాహమా అన్నట్లు కొంతమంది రిపోర్టర్లు నా కేసులో కోర్టు తీర్పు ఇచ్చిందని రాస్తున్నారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా." "చివరగా నేను చెప్పేది ఒకటే, చట్టం తన పని తాను చేసుకుంటుంది." అని ఆమె అన్నారు.

# అంపైర్ పై కేఎల్ రాహుల్ ఫైర్..



భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతున్నాయి. ఓవల్ మైదానం వేదికగా జరుగుతున్న ఐదో టెస్ట్ మ్యాచ్ రెండో రోజు ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జో రూట్, భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ మధ్య మాటల తూటాలు కొనసాగాయి. రూట్ బౌండరీ కొట్టిన తర్వాత ప్రసిద్ధ్ ను ఎగతాళి చేయగా, ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇక, పరిస్థితి తీవ్రతరమవడంతో ఆన్-ఫీల్డ్ అంపైర్లు అహ్సాన్ రజా, కుమార్ ధర్మసేన జోక్యం చేసుకుని ఇరువురితో మాట్లాడారు.అయితే, ఈ ఘర్షణలో భారత ఓపెనర్ కేఎల్ రాహుల్ తన సహచరుడికి అండగా నిలిచాడు. ప్రసిద్ధ్ తరఫున ధర్మసేనను సంప్రదించి వివరణ కోరాడు. అయితే, రాహుల్ మాట్లాడిన తీరు శ్రీలంక అంపైర్ ధర్మసేనకు నచ్చలేదు.. దీంతో ఆయన రాహుల్ ను మందలించి, మ్యాచ్ అనంతరం ఈ విషయంపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అంపైర్ మాటలకు చిర్రెత్తుకు వచ్చిన కేఎల్ రాహుల్.. భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ చేయడం చూడటమే కాకుండా మైదానంలో ఇంకా ఏం జరుగుతుందో కూడా చూడాల్సి బాధ్యత మీపై ఉందన్నారు.మమ్మల్ని కేవలం బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఇంటికి వెళ్ళమంటారా.. మేము ఏమి చేయాలని మీరు కోరుకుంటున్నారు అని అంపైర్ కుమార్ ధర్మసేనను టీమిండియా ఓపెనర్ రాహుల్ ప్రశ్నించాడు. ఇక, ఇప్పటికే ఉత్కంఠభరితంగా సాగుతున్న ఈ సిరీస్ లో ఈ సంఘటన మరింత ఉద్రిక్తతలను పెంచుతుంది.

# కంగారుపడాల్సిన అవసరం లేదు..



ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో భాగంగా లండన్ లోని ఓవల్ క్రికెట్ గ్రౌండ్ లో ఇంగ్లండ్ తో జరుగుతున్న ఐదవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ రెండో ఇన్నింగ్స్ ఆడుతోంది. తొలి ఇన్నింగ్స్ లో 23 పరుగుల లీడ్ సాధించిన ఇంగ్లండ్ .. రెండో ఇన్నింగ్స్ లో టీమిండియాపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే రెండు వికెట్స్ తీసి విజయం సాధించాలని చూస్తోంది. ప్రస్తుతం భారత్ 52 పరుగుల ఆధిక్యంలో ఉన్నా.. మూడో రోజులో ఎన్ని పరుగులు చేస్తుందో అని ఫాన్స్ ఆందోళనలో ఉన్నారు. అయితే కంగారుపడాల్సిన అవసరం లేదని హిస్టరీ చెబుతోంది.ఓవల్ లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఇచ్చినా.. గెలిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలా భారత్ కూడా రెండుసార్లు ఆతిథ్య ఇంగ్లండ్ పై గెలుపొందింది. 1971లో భారత్ తో జరిగిన మ్యాచ్ లో ఇంగ్లండ్ 71 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. రెండో ఇన్నింగ్స్ లో 101 పరుగులకే ఆలౌట్ అయిటీమిండియాకు 173 పరుగుల టార్గెట్ ను విధించింది. లక్ష్యాన్ని భారత్ ఆరు వికెట్లను కోల్పోయి విజయం సాధించింది. 2021లో తొలి ఇన్నింగ్స్ లో భారత్ 191 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లండ్ 290 పరుగులు చేసి 99 పరుగుల లీడ్ సాధించింది. రెండో ఇన్నింగ్స్ లో టీమిండియా 466 పరుగులు చేసి.. 368 పరుగుల లక్ష్యంను విధించింది. ఇంగ్లీష్ జట్టు 210 పరుగులకే ఆలౌట్ అయి ఓడిపోయింది.ప్రస్తుత సిరీస్ లో ఐదవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ రెండో ఇన్నింగ్స్ ను ప్రారంభించింది. రెండో రోజు ఆట ముగిసేసరికి 75/2 స్కోర్ చేసింది. ప్రస్తుతం భారత్ 52 పరుగులు ఆధిక్యంలో ఉంది. యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీ సాధించి క్రీజులో ఉన్నాడు. ఇంకా గిల్, నాయర్, జడేజా, జురెల్, సుందర్ బ్యాటింగ్ చేయాల్సి ఉంది. ఇంకా మూడు రోజుల ఆట మిగిలి ఉన్న నేపథ్యంలో భారత్ ఈరోజు మొత్తం బ్యాటింగ్ చేస్తే భారీ లీడ్ సాధించొచ్చు. ఇంగ్లండ్ ఎదుట కనీసం 350 ప్లస్ టార్గెట్ ఉంచితే భారత్ గెలవడం పెద్ద కష్టమేం కాదు. రెండో రోజు భారత్ ప్రదర్శనపైనే ఫలితం ఆధారపడి ఉంది.

# అంపైర్‌కు అబద్ధం చెప్పిన ఇంగ్లండ్ కెప్టెన్!



లండన్ లోని 'ది ఓవల్' మైదానంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదవ టెస్ట్ ఆసక్తికరంగా మారింది. భారత్ తొలి ఇన్నింగ్స్ లో 224 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 247 పరుగులు చేసింది. దాంతో తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లండ్ 23 పరుగుల లీడ్ సాధించింది. టీమిండియా రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ 52 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు పూర్తిగా బ్యాటింగ్ చేసి.. ఇంగ్లండ్ ముందు 350 ప్లస్ టార్గెట్ ఉంచితే గిల్ సేన గెలవడం పెద్ద కష్టమేం కాదు. రెండో రోజు జైస్వాల్, గిల్, నాయర్ రాణిస్తే టీమిండియాకు తిరుగుండదు. అయితే రెండో రోజు ఆటలో ఓ ఆసక్తికర సంఘటన జరిగింది.రెండవ రోజు ఆట ముగియడానికి దాదాపు 15 నిమిషాల ముందు అంపైర్లు వెలుతురు తక్కువగా ఉందని చెప్పారు. ఇంగ్లండ్ కెప్టెన్ ఓలీ పోప్, అంపైర్ కుమార్ ధర్మసేన మధ్య సంభాషణ జరిగింది. వెలుతురు తక్కువగా ఉన్న నేపథ్యంలో పోప్ కు అంపైర్లు స్పిన్ బౌలింగ్ చేయడానికి మాత్రమే అవకాశం ఇచ్చారు. అందుకు ఇంగ్లండ్ కెప్టెన్ నిరాకరించాడు. దాంతో అంపైర్లు బయిల్స్ తీసేసి.. రెండో రోజు ముగిసినట్లు ప్రకటించారు. యశస్వి జైస్వాల్ అప్పటికే ధాటిగా ఆడుతూ పరుగులు చేస్తున్నాడు. దాంతో పోప్ పేసర్ తో బౌలింగ్ చేయించాలనుకున్నాడు. అంపైర్లు స్పిన్నర్ కు మాత్రమే అవకాశం ఇవ్వడంతో జైస్వాల్ బ్యాటింగ్ కు బయపడిన పోప్ మ్యాచ్ ముగించేశాడు.ఇంగ్లండ్ జట్టులో జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్ స్పిన్ బౌలింగ్ చేయగలరు. స్పిన్నర్ తో బౌలింగ్ చేయిస్తే యశస్వి జైస్వాల్ ఖచ్చితంగా ఆడుతాడని ఓలీ పోప్ కు బాగా తెలుసు. ఆకాష్ దీప్ కూడా అప్పటికే బౌండరీ బాది ఊపుమీదున్నాడు. ఈ పరిస్థితిలో పోప్ మైదానం వదిలి వెళ్లడం మంచిదని భావించాడు. అంపైర్లు అడిగినప్పుడు తమకు స్పిన్నర్లు లేరని పోప్ చెప్పడం వీడియోలో వినిపించింది. ఆ తరువాత తాను జోక్ చేస్తున్నానని అన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'జైస్వాల్ కు బయపడిన పోప్', 'అంపైర్ కు అబద్ధం చెప్పిన ఇంగ్లండ్ కెప్టెన్' అంటూ నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# బుమ్రా కొంపముంచుతున్న సిరాజ్..



టీమిడియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్ లో... మహమ్మద్ సిరాజ్ రెచ్చిపోతున్నాడు. అందిన అవకాశాన్ని ఏమాత్రం వదులుకోవడం లేదు మహమ్మద్ సిరాజ్. ఇంగ్లాండ్ గడ్డపై బుమ్రా రెచ్చిపోతాడు అనుకుంటే.... మహమ్మద్ సిరాజ్ దుమ్ములేపుతున్నాడు. ఈ ఐదు టెస్టుల సిరీస్ లో ఇప్పటివరకు మొత్తం 18 వికెట్లు పడగొట్టి.... లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు సిరాజ్.ఈ నేపథ్యంలోనే బుమ్రా ప్లేస్ కు ఎసరు పెడుతున్నాడు మహమ్మద్ సిరాజ్. ఈ ఇద్దరు ఫాస్ట్ బౌలర్లు కలిసి ఆడిన మ్యాచ్ లో 7 వికెట్లు పడగొట్టాడు మహమ్మద్ సిరాజ్. ఇందులో సిరాజ్ యావరేజ్ 61.28 గా ఉంది. ఇక అదే సమయంలో... బుమ్రా ఆడకుండా కేవలం మహమ్మద్ సిరాజు మ్యాచ్ ఆడితే.... పరిస్థితి వేరేలా ఉంది. అలా ఆడిన అనే పద్యంలో మూడు ఇన్నింగ్స్ లలో ఏకంగా 11 వికెట్లు పడగొట్టాడు మహమ్మద్ సిరాజ్. ఇందులో 19.36 ఎకానమీ ఉంది. అలాగే ఎలాంటి గాయాలు లేకుండా... ప్రతి సిరీస్ లో మహమ్మద్ సిరాజ్ తన ప్రతిభ కనబరుస్తున్నాడు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో బుమ్రా స్థానం గల్లంతు అవుతుందని కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు.


# పేసర్ వోక్స్ అవుట్



భారత్ తో జరుగుతున్న ఐదో టెస్టుకు ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ గాయంతో దూరమయ్యాడు. తొలి రోజు లాంగ్ ఆఫ్ లో ఫీల్డింగ్ చేస్తున్న వోక్స్ ... కరుణ్ నాయర్ కొట్టిన బంతిని ఆపే ప్రయత్నంలో డైవ్ చేశాడు. అయితే ఈ క్రమంలో తన శరీర బరువంతా ఎడమ భుజంపై పడడంతో గాయమైంది. స్కానింగ్ లో భుజం ఎముక స్థానభ్రంశం అయినట్టు తేలింది. దీంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ లో అతడు బ్యాటింగ్ కూ దూరమయ్యాడు. బౌలింగ్ లోనూ జట్టుకు టంగ్ , ఒవర్టన్ , అట్కిన్సన్ లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


# బిజినెస్

## భారీగా పెరిగిన బంగారం ధర



బంగారం ప్రియులకు మళ్లీ షాకిచ్చింది. వరుసగా రెండు రోజులు తగ్గిన బంగారం ధరలు.. శనివారం అమాంతంగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్రిక్త పరిస్థితులు.. ట్రంప్ విధించిన సుంకాలు కారణంగా మళ్లీ ధరలు కొండెక్కుతున్నాయి. తులం బంగారం ధర రూ. 1,530 పెరిగింది. సిల్వర్ ధర మాత్రం ఉపశమనం కలిగించింది.24 క్యారెట్ల గ్రాము బంగారం ధర 1,530 రూపాయలు పెరిగి.. ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,01,350 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 1,400 రూపాయిలు పెరిగి.. తులం బంగారం ధర రూ. 92,900 దగ్గర ట్రేడ్ అవుతోంది. మరోవైపు 18 క్యారట్ల గ్రాము బంగారం ధర 1,140 రూపాయిలు పెరిగి 10 గ్రాముల ధర రూ.76,010 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇది ఇలా ఉండగా.. వెండి ధరలు ఉపశమనం కలిగిస్తోంది.. కేజీ వెండి రూ.1,13,000 దగ్గర ట్రేడ్ అవుతుంది. ప్రాంతాల వారీగా నిత్యం బంగారం, వెండి ధరల్లో మార్పులు ఉంటాయి.

## కేవలం రూ.1 ఎక్స్ట్రా చెల్లిస్తే చాలు




దేశీయ దిగ్గజ టెలికాం సంస్థల్లో ఒకటైన ఎయిర్ టెల్ (Airtel) తన యూజర్లకు గొప్ప శుభవార్త చెప్పింది. ఈ ప్లాన్ లో గత ప్లాన్ కన్నా కేవలం రూ.1 ఎక్స్ ట్రా చెల్లిస్తే అదనంగా 14GB డేటాను పొందవచ్చు. ఈ కొత్త ప్లాన్ దేశంలోని అన్ని టెలికాం సర్కిల్ లలోని యూజర్లకు అందుబాటులో ఉంది. మరీ ఈ కొత్త ప్రీపెయిడ్ ప్లాన్ గురించి వివరంగా తెలుసుకుందామా.ఎయిర్ టెల్ గతంలో రూ.398 రీఛార్జ్ ప్లాన్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో 28 రోజుల వ్యాలిడిటీతో అన్ లిమిటెడ్ కాలింగ్, భారత్ అంతటా ఫ్రీ నేషనల్ రోమింగ్, రోజువారీ 2GB డేటా, 100 ఫ్రీ SMS వంటి సదుపాయాలను పొందవచ్చు. అలాగే, అన్ లిమిటెడ్ 5G, జియోహాట్ స్టార్ సబ్ స్క్రిప్షన్ ను కూడా అందించింది. ఇక ఇప్పుడు ఈ ప్లాన్ ను అదనంగా ఒక రూపాయితో కొత్త రూ.399 ప్లాన్ కి అప్ గ్రేడ్ చేసుకోవచ్చు. దీంతో ప్రతి రోజు అదనంగా 512MB డేటాను పొందవచ్చు. అంటే ఒక నెల వ్యవధిలో రూ.1 ఖర్చుతో అదనంగా 14GB డేటా పొందవచ్చు. కాగా, దేశంలో రిలయన్స్ జియో తర్వాత అధిక మంది ఎయిర్ టెల్ ను వినియోగిస్తున్నారు.

## మార్కెట్లకు ట్రంప్ పోటు

ట్రంప్ సుంకాల పోటుతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీగా నష్టపోయాయి. శుక్రవారం ట్రేడింగ్ లో సెన్సెక్స్ ఒక దశలో 690 పాయింట్లు పతనమై 80,500 దిగువ స్థాయికి జారుకుంది. చివర్లో కాస్త కోలుకున్న సూచీ 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయి 24,565.35 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.5 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి రూ.444.52 లక్షల కోట్లకు జారుకుంది. గురువారం ట్రేడింగ్ లోనూ సెన్సెక్స్ 296 పాయింట్లు, నిఫ్టీ 86 పాయింట్లకు పైగా కోల్పోయాయి. సెన్సెక్స్ లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. సన్ ఫార్మా 4.49 ు క్షీణించి సూచీ టాప్ లూజర్ గా మిగిలింది. ఫారెక్స్ ట్రేడింగ్ లో డాలర్ తో రూపాయి మారకం విలువ ఏకంగా 47 పైసలు పెరిగి రూ.87.18 వద్ద ముగిసింది.భారత్ పై 25 శాతం సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ పరిణామం తమ ఎగుమతి వాణిజ్యంపై ప్రభావం చూపనుందన్న ఆందోళనలతో గ్లోబల్ మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లూ పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా ఫార్మా, మెటల్ , ఐటీ రంగ షేర్లు అధిక ఒత్తిడికి లోనయ్యాయి. మన మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, అంతర్జాతీయంగా డాలర్ బలోపేతం, కంపెనీల జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేకపోవడం, టెక్నికల్ చార్టుల్లో సూచీలు కీలక మద్దతు స్థాయిలను కోల్పోవడం ట్రేడింగ్ సెంటిమెంట్ ను మరింత బలహీనపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) రూ.4,011 కోట్ల ఐపీఓకు భారీ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఈ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 41.01 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. క్యూఐబీలకు కేటాయించిన వాటా షేర్లకు ఏకంగా 103.97 రెట్ల బిడ్లు రాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల వాటా షేర్లకు 34.98 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 7.73 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఎస్‌డీఎల్.. ఈ నెల 6న షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుంది.ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 863.18 పాయింట్లు (1.05 శాతం), నిఫ్టీ 271.65 పాయిం ట్లు (1.09 శాతం) నష్టపోయా యి. నిఫ్టీ గడిచిన ఐదు వారాలుగా నష్టాల్లో కొనసాగుతోంది. సూచీ ఇన్ని వారాలుగా నష్టాల్లో కొనసాగడం 2023 ఆగస్టు తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి.



## రూ.44 కోట్లతో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ




అంతర్జాతీయ డ్రోన్ తయారీదారు ఫిక్సర్ నుంచి రూ.85 కోట్ల ఆర్డర్ ను అందుకున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ గ్రూప్ వెల్లడించింది. కంపెనీ హైదరాబాద్ లోని ప్లాంట్ లో డ్రోన్ డిజైన్ , డ్రోన్ సబ్ సిస్టమ్స్ తయారీ సహా ఆటోపైలెట్స్ , లిథియం బ్యాటరీలు, బ్యాటరీ మేనేజ్ మెంట్ సిస్టమ్స్ (బీఎంఎస్ ), నావిగేషన్ యూనిట్స్ , కాంపోజిట్ ఎయిర్ ఫ్రేమ్స్ ను ఉత్పత్తి చేస్తోంది. కాగా వచ్చే రెండేళ్లలో రూ.44 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ, అప్ గ్రేడేషన్ చేపట్టనున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ ఎండీ పంకజ్ ఆకుల చెప్పారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత కంపెనీ దేశీయంగా తయారు చేసిన డ్రోన్ కాంపోనెంట్స్ కు మంచి గుర్తింపు లభించిందన్నారు. కంపెనీ తయారు చేసిన డ్రోన్స్ ను భారత సైనిక దళాలు పూర్తి స్థాయిలో వినియోగించుకున్నాయని ఆయన వివరించారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కంపెనీ టర్నోవర్ రూ.35 కోట్ల నుంచి రూ.70 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పంకజ్ చెప్పారు.

## టెస్లాకు రూ.2100 కోట్ల జరిమానా!



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన ప్రముఖ దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లా కు భారీ జరిమానా పడింది. ఆటోపైలట్ వ్యవస్థతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ దాదాపు రూ.2100 కోట్లు బాధితులకు చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాల్లోకి వెళ్లితే.. 2019లో అమెరికాలోని ఫ్లోరిడాలో టెస్లా కారులోని ఆటోపైలట్ కారణంగా రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 22 ఏళ్ల యువతి మృతిచెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఫ్లోరిడాలోని మియామీ ఫెడరల్ కోర్టు విచారణ చేపట్టింది. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన కోర్టు.. ఆటోపైలట్ వ్యవస్థతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి టెస్లానే బాధ్యత వహించాల్సిందని తేల్చింది. దీనిపై సుదీర్ఘ విచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. టెస్లా 240 మిలియన్ డాలర్లు (దాదాపు 2,100 కోట్లు) పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశించింది.జార్జ్ మెక్ గీ అనే వ్యక్తి అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్ ను ఉపయోగించాడు. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్ లోనే ఉందని భావించిన అతడు 62 mph వేగంతో వెళ్లాడు. అయితే, మార్గమధ్యలో స్టాప్ సైన్, ఫ్లాషింగ్ లైట్స్ దాటి, టీ-జంక్షన్ లోకి వెళ్లి ప్రమాదం చేశాడు. దీనికి జార్జ్ కోర్టులో సమధానమిస్తూ.. 'నేను టెక్నాలజీపై ఎక్కువ నమ్మకం పెట్టుకున్నాను. కారుకి ఎదుట ఏమన్నా కనబడితే బ్రేక్ వేస్తుందని అనుకున్నాను' అని అన్నాడు. దీంతో కోర్టు డ్రైవర్ నిర్లక్ష్యంగా ఉండటం నిజమే అయినా, టెస్లా ఆటోపైలట్ వ్యవస్థ కూడా పని చేయకపోవడమే ప్రమాదానికి కారణమని.. ఇందులో డ్రైవర్ ను 67% బాధ్యుడిగా, టెస్లాను 33% బాధ్యుడిగా కోర్టు పేర్కొంది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇందులో మూడోవంతు టెస్లా చెల్లించనుంది.



## టిల్లు బ్యూటీ సాఫ్ట్ సర్వ్


టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ నేహా శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'మెహబూబా' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ.. 'డీజే టిల్లు' మూవీతో ఓవర్ నైట్ స్టార్ గా మారిపోయింది. ఈ సినిమాలో రాధిక క్యారెక్టర్ లో అదరగొట్టింది. తన అందం, అభినయంతో కుర్రకారు మనసులు కొల్లగొట్టింది. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. కానీ ఆ తర్వాత చేసిన పలు సినిమాలు అంతగా గుర్తింపును తెచ్చి పెట్టలేకపోయాయి. అయినప్పటికీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ తన అందాలతో గత్తరలేపుతుంది.ఈ క్రమంలో ఈ భామ ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా నేహా శెట్టి ఇన్ స్టా వేదికగా కొన్ని పిక్స్ షేర్ చేసింది. వైట్ కలర్ అవుట్ ఫిట్ లో తన వాలు కళ్ళతో వయ్యారంగా చూస్తున్నది. అలాగే థైస్ షో చేస్తూ ఘాటు ఫొటోస్ కి స్టిల్స్ ఇచ్చింది. ఫ్రంట్ అండ్ బ్యాక్ అందాలతో వావ్ అనిపించింది. ఇక వాటికి సాఫ్ట్ సర్వ్ అనే క్యాప్షన్ జోడించింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక వీటిని చూసిన నెటిజన్లు నీ తొడలు మిల్క్ షేకులా ఉన్నాయంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు ఈ భామ పోస్ట్ పై ఓ లుక్ వేసేయండి.



## సంయుక్త మీనన్ మరో ఛాన్స్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో కొంతమంది మాత్రమే అతి తక్కువ కాలంలో పాపులర్ అవుతూ ఉంటారు. అలాంటి హీరోయిన్లలో సంయుక్త మీనన్ ఒకరు. బింబిసారా, సార్, విరూపాక్ష సినిమాలతో... హీరోయిన్ సంయుక్త మీనన్ మంచి.. క్రేజ్ సంపాదించుకుంది.తెలుగు ప్రేక్షకులు కూడా.. ఆమె సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే అలాంటి హీరోయిన్ సంయుక్త మీనన్ కు అదిరిపోయే ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సాయి ధరంతేజ్ తో జతకట్టిన సంయుక్త మీనన్... ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవిలో కూడా ఛాన్స్ కొట్టేసిందట.అనిల్ రావిపూడి అలాగే మెగాస్టార్ చిరంజీవి కాంబినేషన్ లో సినిమా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో.. రెండవ హీరోయిన్ గా సంయుక్త మీనన్ ను తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో మెయిన్ హీరోయిన్ నయనతార అన్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాకు మన శంకర వరప్రసాద్ గారు అని టైటిల్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.

## 'హ్యాపీ బర్త్‌డే మై లవ్'



టాలీవుడ్ యంగ్ బ్యూటీ మెహ్రీన్ ఫిర్జాదా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'కృష్ణగాడి వీర ప్రేమ గాథ'సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఫస్ట్ మూవీతోనే మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత F2, F3 సినిమాలతో మరింత క్రేజ్ తెచ్చుకుంది. అలాగే తన అందం అభినయంతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. ఇక కెరీర్ స్టార్టింగ్ లోనే ఓ వ్యక్తితో ఎంగేజ్ మెంట్ చేసుకుని షాక్ ఇచ్చిన ఈ బ్యూటీ కొన్నాళ్లకే బ్రేకప్ అయిపోయిందని వెల్లడించింది. అయితే అప్పుడు ఫుల్ బక్కచిక్కి పోయి కనిపించి అయ్యో పాపం అనిపించింది. ఇప్పుడిప్పుడే మళ్లీ మంచి గ్లామరస్ గా తయారవుతుంది.ఇదిలా ఉంటే.. సినిమాలకు దూరమైన ఈ భామ సోషల్ మీడియా లో మాత్రం ఫుల్ యాక్టీవ్ గా ఉంటూ నిత్యం అందాల జాతరతో అదరహో అనిపిస్తుంది. అంతేకాకుండా తన వ్యక్తిగత జీవితం గురించి పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా మెహ్రీన్ తన ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఓ స్టోరీ పెట్టింది. అందులో ఓ వ్యక్తితో ఉన్న ఫొటో షేర్ చేస్తూ.. 'హ్యాపీ బర్త్ డే మై లవ్'అనే క్యాప్షన్ రాసుకొస్తూ రెడ్ హార్ట్ లవ్ సింబల్ జోడించింది. అంతేకాకుండా అతనితో క్లోజ్ గా ఉన్న ఫొటో షేర్ చేయడంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు ఈ జంటకు కంగ్రాట్స్ చెబుతున్నారు.

## ఆ చిత్రానికి రెండు నేషనల్ అవార్డులు..




'ది కేరళ స్టోరీ' చిత్రం రెండు నేషనల్ అవార్డులు పొందింది. సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కేరళలోని మహిళలను బలవంతంగా ఇస్లాంలోకి మార్చడం, ఐఎస్ఐఎస్ లో చేర్చడాన్ని గురించి వివరిస్తుంది. రిలీజ్ సమయంలోనే ఎన్నో నిరసనలు ఎదుర్కొన్న ఈ చిత్రానికి 71వ జాతీయ చలనచిత్ర అవార్డులు రావడంపై కేరళ సీఎం పినరయి విజయన్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. జ్యూరీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేరళకు తీవ్రమైన అవమానంగా వర్ణించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న ఈ చిత్రం.. రాష్ట్ర ఇమేజ్ ను దెబ్బతీస్తుందని.. సొసైటీలో విద్వేషాన్ని రెచ్చగొడుతుందని పేర్కొన్నారు. సంఘ్ పరివార్ విభజన భావజాలానికి కట్టుబడి ఈ నిర్ణయం తీసుకున్న జ్యూరీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని కోరారు.ప్రతిపక్ష నాయకులు వి.డి. సతీషన్ కూడా సీఎం పినరయి విజయన్ అభిప్రాయాన్ని సమర్థించారు. సెంట్రల్ గవర్నమెంట్ నేషనల్ అవార్డులను మతపరమైన విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు వాడుతుందన్నారు. బీజేపీ, సంఘ్ పరివార్ కేరళ గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ రాజకీయ లాభం పొందేందుకు చూస్తున్నాయని ఆరోపించారు.



అనుష్క ప్రభాస్ తో డేటింగ్ లో ఉన్నారనే వార్తలు నిత్యం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతునే ఉంటాయి. అంతేకాకుండా వీరిద్దరూ త్వరలో పెళ్లి కూడా చేసుకోబోతున్నారని ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి.కానీ ఈ విషయాలను అనుష్క, ప్రభాస్ ఇద్దరూ ఖండించారు. అలా ఈ భామ మ్యారేజ్ గురించి ఎన్నో పుకార్లు షికార్లు చేస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో తాజాగా ఇంటర్వ్యూలో తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చింది అనుష్క . ఈ అమ్మ డు ఓ ఇంట ర్వ్యూలో మాట్లాడుతూ...

## అతన్నే పెళ్లి చేసుకుంటా

'బాహుబలి విడుదలైన తర్వాత నాపై పెళ్లి ఒత్తిడి ఎక్కువైంది. కుటుంబ సభ్యులే కాదు, మీడియా నుంచి కూడా ఇదే ప్రశ్న వస్తోంది. నాకు పెళ్లిపై పూర్తి నమ్మకం ఉంది.సరైన వ్యక్తి, సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటా. ప్రేమ లేకుండా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. నేను ప్రేమించే వ్యక్తినే వివాహం చేసుకుంటాను. నా తల్లిదండ్రులు ఈ విష యంలో నాకు మద్దతుగా ఉన్నారు. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిని మాత్రం పెళ్లి చేసుకోను' అని చెప్పుకొచ్చింది. అయితే ఇన్ని రోజులు ప్రభాస్ ను చేసుకుంటుందని అనుకున్న ఫ్యాన్స్ అనుష్క ఇలా తేల్చి చెప్పడంతో వాళ్లు షాక్ కు తున్నారు.

## స్ట్రీమింగ్‌కు రెడీ 'మోతెవరి లవ్ స్టోరీ'




భారతదేశంలో అతిపెద్ద స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ అయిన ZEE5లో ఓ అచ్చమైన, స్వచ్ఛమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో 'మోతెవరి లవ్ స్టోరీ' అనే సిరీస్ ఆగస్టు 8 నుండి స్ట్రీమింగ్ కి రాబోతోంది. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ను శివ కృష్ణ బుర్రా రూపొందించగా, మధుర శ్రీధర్ రెడ్డి, శ్రీరామ్ శ్రీకాంత్ నిర్మాతలు. ఏడు ఎపిసోడ్స్ గా రాబోతోన్న ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ అందరినీ ఆకట్టుకునేలా ఉండబోతోందని ఇప్పటికే విడుద లైన టీజ ర్ , ట్రైల ర్ తో స్పష్టమైంది. ఇందులో భాగంగా తాజాగా శుక్రవారం ఈ మూవీ నుంచి 'గిబిలి గిబిలి' అనే పాటను మేకర్స్ విడుదల చేశారు.హీరోయిన్ కు తన మనసులోని ప్రేమను హీరో వ్యక్తం చేసే క్రమంలో ఈ 'గిబిలి గిబిలి' పాట వస్తుంది. సోష ల్ మీడియాలో ఫ్రీక్వెంట్ గా ఉప యోగించే పదాల తో ఈ పాట ను రాయటం అందరినీ ఆకట్టుకుంటోంది. మల్లెగోడ గంగ ప్రసాద్ రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడగా, చరణ్ అర్జున్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో న టించిన ఈ చిత్రానికి శ్రీకాంత్ అరుపుల సినిమాటోగ్ర ఫీ అందిస్తుండ గా, చరణ్ అర్జున్ సంగీతాన్ని అందిస్తున్నారు. అనీల్ గీల ఎడిట ర్ గా వ్య వ హ రిస్తున్నారు.



## మాస్ జాతర షురూ

నేచురల్ స్టార్ నాని ప్రజెంట్ నటిస్తున్న సినిమా 'ది ప్యారడైజ్'. దీనికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే వీరిద్దరి కాంబోలో వచ్చిన 'దసరా' మూవీ నేషనల్ లెవెల్ కి ఎదిగిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్నారు. ఇక ఇందులో మోహన్ బాబు, కయాదు లోహార్, రాఘవ జూయల్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.కాగా నాని కెరీర్ లోనే అతిపెద్ద బడ్జెట్ తో రూపొందిస్తున్న ఈ మూవీను 2026 మార్చి 26న గ్లోబల్ గా విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో తాజాగా నానికు సంబంధించిన లుక్ లీక్ అయింది. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న ఫొటోలో నాని పొడవాటి జుట్టు, గడ్డంతో మాస్ గ్యాంగ్ స్టర్ గా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఉన్న నేచురల్ స్టార్ ఈ లుక్ కి అభిమానులు ఫిదా అవుతూ.. ఇది నాని కెరీర్ లో బెస్ట్ లుక్ ఇదే అని, ఈసారి మాస్ జాతర షురూ అంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. కాగా సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.




## ఈసారి పాన్ వరల్డ్ టార్గెట్



వివిధ జానర్లతో తనదైన ముద్ర వేసిన దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇప్పుడు ఓ పవిత్రమైన ప్రయత్నానికి శ్రీకారం చుట్టాడు. హనుమంతుని మహిమను, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరో కోణంలో చూపించేందుకు ప్రయత్నిస్తున్న ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ – 'జై హనుమాన్'. హనుమంతుని జీవితం, ధైర్యం, భక్తి అన్నీ కలిసిన ఓ సాంకేతిక కాంభినేషన్ గా తెరకెక్కించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా స్క్రిప్ట్ పూర్తిగా లాక్ అయింది, వీఎఫ్ ఎక్స్ ఆధారిత ప్రీ-ప్రొడక్షన్ వర్క్ కూడా దాదాపు పూర్తయింది. ఇక హీరో రిషబ్ షెట్టి ప్రజంట్ 'కాంతార 2' కంప్లీట్ చేయడం మాత్రమే మిగిలి ఉంది. ఆయన వస్తే వెంటనే షూటింగ్ ప్రారంభించడమే.ఇది సాధారణ పాథలాజికల్ మూవీ కాదని, ఇందులో అత్యాధునిక విజువల్ టెక్నాలజీ ఉపయోగించనున్నారని తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ గతంలో 'హను మాన్' లో చూపించిన విజువల్స్ ను మించిపోయేలా ఉంటుందట. దీంతో ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే నేషనల్ .. ఇంటర్నేషనల్ స్థాయిలో ఆసక్తి పెరుగుతోంది. అందుకే ఈ సినిమా తాలూకు లక్ష్యాన్ని ప్రశాంత్ వర్మ చాలా స్పష్టంగా చెప్పారు..'హనుమంతుల వారి గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయడమే ఈ చిత్ర ఉద్దేశం. ఇది కేవలం భక్తి చిత్రం కాదు. ఇది ఒక కల్చరల్ మానిఫెస్టో' అని ఆయన చెప్పారు. అందుకే ఈ ప్రాజెక్టు కోసం ప్రశాంత్ గత కొన్నేళ్లుగా రీసెర్చ్ చేశారు. పురాణాల నుంచి ఆధునిక టెక్నాలజీ వరకు అన్ని స్థాయిల పరంగా ఈ సినిమా అభివృద్ధి చెందుతున్నట్లు తెలుస్తోంది.

## జాతీయ అవార్డులపై నెటిజన్ల ఫైర్ !



ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి పలు ప్రతిష్టాత్మక అవార్డుల లో జాతీయ అవార్డులు కూడా ఒకటి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా వివిధ విభాగాల్లో ఉత్తమ సినిమా లు, నటీనటులను పురస్కరించే జాతీయ అవార్డుల లిస్ట్ విడుదలైంది. అయితే ఈసారి ఈ అవార్డుల ఎంపిక పట్ల సినీ ప్రియులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తెలుగు సినిమాలతో పాటు పాన్ ఇండియా స్థాయిలో ప్రతిష్టాత్మక చిత్రాలకూ, అవార్డుల జాబితాలో నిలిచే అవకాశమున్న నటీనటుల కూ గుర్తింపు రాకపోవడం చూసి ప్రేక్షకులు నిరాశకు లోనయ్యారు.ఈసారి 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ చేసిన పాత్రను మెచ్చుకోని వారే లేరు. అదే విధంగా మళయాళంలో 'ఆడు జీవితం' చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ జీవించిన లైఫ్ టైమ్ పెర్ఫామెన్స్ కూడా బహుమతుల జాబితాలో లేకపోవడం ప్రేక్షకులకు అసహ్యాన్ని కలిగించింది. పైగా 12th ఫెయిల్, సామ్ బహుదూర్ వంటి చిత్రాల్లో నటీనటుల ప్రదర్శన కూడా మెచ్చుకోదగినదే అయినప్పటికీ, అవార్డుల కూర్చీ దగ్గర దృష్టిలో పడకపోవడం పట్ల నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ అవార్డుల ఎంపికలు నిజంగా న్యాయంగా జరిగాయా? లేక ప్రాసెస్ లో బలమైన కారణం ఉందా? అనే డౌట్లు అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో '12త్ ఫెయిల్', 'సామ్ బహుదూర్' లాంటి హ్యాష్ టాగ్స్ ట్రెండ్ అవుతున్నాయి. ఇక ప్రతి సంవత్సరం అవార్డుల సమయంలో అంచనాలు ఉంటాయి. అవి నెరవేరకపోతే బాధ ఉండటం సహజం. కానీ ఈసారి మాత్రం అవార్డుల ఎంపిక ప్రక్రియ పై విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజమైన ప్రతిభకు గుర్తింపు దక్కాలన్నది ప్రతి ప్రేక్షకుడి ఆకాంక్ష. మరి రానున్న రోజుల్లో ఇది నెరవేరుతుందా? అనేది వేచి చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**